హైదరాబాద్ వార్త



# అనధికారిక ప్రైవేట్ స్కూళ్లు

**నగరంలో గుర్తింపు లేని చదువు**

**గుట్టుచప్పుడు కాకుండా అడ్మిషన్లు**

**నోటీసుల జారీతో సరిపెడుతున్న విద్యాశాఖ**

**గ్రేటర్‌లో 800లకుపైగా అనుమతిలేని స్కూళ్లు**

అధికారుల తనిఖీలు నామమాత్రమే.. ప్రతిపాఠశాలలకు వెళ్ళి అధికారులు అనుమతులను తనిఖీలు చేయాల్సి ఉండగా మామూళ్ల మత్తులో అటు వెళ్లేడమే మరిచిపోతున్నారు. ముఖ్యంగా పార్కింగ్ సదుపాయం, విశాలమైన ఎంట్రెన్స్‌లు ఉండాలి. ప్రైవేట్ భవనాల్లో పాఠశాలలకు క్రీడా మైదానాలు లేకపోయినా లిఫ్ట్ సౌకర్యం లేకపోయినా అనుమతులు ఇవ్వకూడదు. హైదరాబాద్‌రంగారెడ్డి జిల్లాల్లో 4500లకుపైగా ప్రైవేట్,కార్పొరేట్ పాఠశాలలు ఉంటే దాదాపు 30శాతం అనుమతులులేవు. హైదరాబాద్‌లోని మార్కేడ్‌పల్లి,గోల్కొండ, ఆసిఫ్‌నగర్, సైదాబాద్, రంగారెడ్డి జిల్లాలోని సరూర్‌నగర్, గండిపేట్, రాజేంద్రనగర్, శేరిలింగంపల్లి, మేడ్చల్ జిల్లాలోని పేట్ బషీరాబాద్ మండలాల్లో కొన్ని అనుమతుల లేని ప్రైవేట్ పాఠశాలలు నడస్తున్నాయి.



హైదరాబాద్, జూన్ 24,ప్రభాతవార్త: ఇతర వ్యాపారాలతో పోలిస్తే ప్రైవేట్ పాఠశాల విద్య లాభసాటిగా మారింది. తక్కువ ఖర్చు, తక్కువ సమయంలో ఎక్కువ లాభాలు సంపాదించి పెడుతుంది. అందుకే చాలామంది ప్రైవేట్ పాఠశాలలపై దృష్టిసారించారు. కాలనీల మధ్య ఖాళీ స్థలం ఉంటే చాలా ఎంచక్కా ఓభవనం నిర్మించి స్కూల్ పెట్టేస్తున్నారు. లేకపోతే ఓభవనాన్ని అద్దెకు తీసుకుని ఓబోర్డు తగిలించేస్తున్నారు. ఎలాగూ ఇంటి పక్కనే స్కూల్ ఉండటంతో తల్లిదండ్రులు కూడా మంచీచెడు ఆలోచించకుండా పిల్లలను వాటిలో చేర్పిస్తూ యాజమాన్యం అడిగినంత ఫీజులు చెల్లిస్తున్నారు. తీరా వాటికి గుర్తింపు లేదని తెలిసి తాము మోసపోయామంటూ ఆందోళనకు దిగుతున్నారు. అంతేకాదు .ఇక క్రీడామైదానాల సంగతీ ప్రత్యేకంగా చెప్పనవసరం లేదు. కనీసం గాలి కూడా దూరనంత ఇరుకైన గదుల్లో తరగతులు నిర్వహిస్తున్నారు. ఏదైనా విపత్తులు జరిగినప్పుడు భారీ మూల్యమే చెల్లించుకోక తప్పదు. కొన్ని యామమాన్యాలు స్టేట్ సెలబస్‌కు గుర్తింపు తీసుకుని, గట్టుచప్పుడు కాకుండా ఐఐటి లాంటి కోర్సులు నిర్వహిస్తూ ..ఆపేరుతో భారీ వసూళ్లకు పాల్పడుతన్నారు. ఇలా గ్రేటర్‌హైదరాబాద్‌లో 800లకుపైగా స్కూళ్లు ఎలాంటి పర్మిషన్ లేకుండా నడస్తున్నట్లు తెలుస్తుంది.

**ప్లేస్కూల్,ప్రీ స్కూల్‌కు అనముతులు తప్పనిసరి..** ఇటీవల మణికొండ జాలీకిడ్స్ ప్లేస్కూల్‌లో జరిగిన అగ్నిప్రమాదం వివరాలు తెలుసుకునేందుకు విద్యాశాఖ అధికారులు వెళ్తే దానికి ఎలాంటి అనుమతుల్లేవని తేలింది. అక్కడ అసలు పాఠశాల ఉన్నసంగతే తెలియదని అధికారులు చెప్పడం ఆశ్చర్యాన్ని కలిగించింది. విద్యాశాఖ చట్టం ప్రకారం ప్లేస్కూల్, ప్రీస్కూళ్లకు అనుమతి తప్పనిసరిగా ఉండాలి. గతంలో అనుమతులు అసవరం లేదంటూ కొందరు కోర్టుకు వెళ్లారు. దిల్‌షుఖ్‌నగర్‌లోని ఓప్లేస్కూల్‌లో ఐదేళ్ల క్రితం జరిగిన లిఫ్ట్ ప్రమాదంలో నాలుగేళ్ల విద్యార్థి చనిపోవడం ప్రభుత్వం స్పందించి తప్పనిసరిగా అనుమతులు తీసుకోవాలంటూ ఉత్తర్వులు జారీ చేసింది. ప్రస్తుతం గ్రేటర్ హైదరాబాద్‌లో 1200లకుపైగా ప్లేస్కూళ్లు ఉండగా అనుమతి తీసుకున్నవి ఇమాత్రం 450మాత్రమే ఉన్నాయి. టెక్నో స్కూల్, ఈటెక్నోస్కూల్ అనే పేర్లు వినియోగించకూడదని ప్రభుత్వం ఆదేశాలున్నా పాఠశాలల నిర్వాహకులు ఎవరూ పట్టించుకోకుండా తమకు ఇష్టం వచ్చినట్లు రాసుకుంటున్నారు.

# మెట్రోలు ఫుల్

ప్రయాణికులు పెరిగి రైళ్లలో రద్దీ ఏర్పడుతుండటంతో అందుకు అనుగుణంగా సౌకర్యాలు కల్పించాలని ప్రయాణికులు కోరుతున్నారు. ప్రతి కారిడార్‌లోనూ పీక్ అవర్స్‌లో తీవ్ర సమస్య ఏర్పడుతోంది

**మెట్రోలో నిల్చోడానికి స్థలం దొరకని పరిస్థితి**

**ఫుల్‌కెపాసిటీతో తిరుగుతున్న మెట్రో**

**ట్రాఫిక్ కారణంగా మెట్రోలో వెళ్లేందుకు ఇంట్రెస్ట్**

**రైళ్లలో ఇరుక్కుని ట్రావెల్ చేస్తున్న జనం**



హైదరాబాద్, జూన్ 24 ప్రభాతవార్త : బస్సులు, లోకల్ రైళ్లు, క్యాబ్‌లు తదితర రవాణా సాధానాల్లో నగరంలో ప్రతి రోజూ కొన్ని లక్షల మంది ప్రయాణిస్తూ ఉంటారు. ఇందులో నాలుగున్నర లక్షల మంది మెట్రోలోనే ప్రయాణం చేస్తున్నారు. తక్కువ సమయంలో గమ్యస్థానానికి చేరుకునే వీలుండటంతో అధిక శాతం మంది మెట్రోనే ఆశ్రయిస్తున్నారు. అయితే, కొంతకాలంగా నగరంలో అన్ని రకాల కార్యకలాపాలు తిరిగి నడుస్తుండటంతో మెట్రోలో ప్రయాణిస్తున్న వారి సంఖ్య భారీగా పెరిగింది. ముఖ్యంగా ఉదయం, సాయంత్రం వేళల్లో మెట్రో రైళ్లలో నిల్చోడానికి స్థలం కూడా దొరకని పరిస్థితి ఏర్పడుతోంది. స్టేషన్లలో జనం తోసుకుంటూ రైలు ఎక్కేస్తున్నారు. కొంచెం ప్లేస్ ఉన్నా ఇరుక్కుని మరీ వెళ్తున్నారు. ట్రాఫిక్ తిప్పల నుంచి తప్పించుకుని నగరంలో తిరగలేని పరిస్థితి ఏర్పడుతోంది. దీంతో అనేకమంది మెట్రోను ఆశ్రయిస్తున్నారు. ప్రస్తుతం మెట్రో రైళ్లు ఫుల్‌కెపాసిటీతో తిరుగుతున్నాయి. ఏ సమయంలో చూసినా రద్దీగానే కనిపిస్తున్నాయి. పీక్ అవర్స్ అయిన ఉదయం 7 నుంచి 11 గంటల వరకు, సాయంత్రం 6 నుంచి రాత్రి 10 గంటల టైమ్‌లో దాదాపు లక్షన్నర మంది మెట్రోలో ప్రయాణిస్తున్నట్లు అధికారులు పేర్కొంటున్నారు. మిగతా సమయంలో 5 నిమిషాలకు ఒక ట్రైన్ నడుపుతుండగా పీక్ అవర్స్‌లో ప్రతి 3 నిమిషాలకు ఒక ట్రైన్ నడుపుతున్నారు.

ప్రయాణికులు పెరిగి రైళ్లలో రద్దీ ఏర్పడుతుండటంతో అందుకు అనుగుణంగా సౌకర్యాలు కల్పించాలని ప్రయాణికులు కోరుతున్నారు. ప్రతి కారిడార్‌లోనూ పీక్ అవర్స్‌లో తీవ్ర సమస్య ఏర్పడుతోంది. ఐటీ కారిడార్, హైటెక్ సిటీ, రాయదుర్గం, అమీర్‌పేట నుంచి నాగోల్, ఎల్‌బినగర్, మియాపూర్ రూట్లలో ఉదయం, సాయంత్రం విపరీతంగా రద్దీ ఉంటోంది. మెట్రో స్టేషన్లు, ప్లాట్‌ఫామ్‌లు ఫుల్‌రష్‌తో కనిపిస్తున్నాయి. పీక్ అవర్స్‌లో 3 నిమిషాలకు ఒక ట్రైన్‌ను నడిపిస్తున్నామని మెట్రో అధికారులు చెప్తున్నప్పటికీ కొన్ని సందర్భాల్లో అలా జరగడంలేదని ప్రయాణికులు పేర్కొంటున్నారు. నాలుగైదు నిమిషాలకు ఒక ట్రైన్ వస్తోందని, దీంతో మరింత రద్దీ ఏర్పడుతోందని అంటున్నారు. రైళ్ల రాకపోకల మధ్య సమయాన్ని మరింత తగ్గించాలని, కోచ్‌లను పెంచాలని కోరుతున్నారు. ఇప్పటికే పాఠశాలలు మినహా విద్యాసంస్థలన్ని ప్రారంభమయ్యాయి.దీంతో ట్రాఫిక్‌కి భయపడి మెట్రోలో జర్నీ చేస్తున్నారు. కానీ ఇది కూడా ఇబ్బందిగానే ఉంటోందని పలువురు పేర్కొంటున్నారు.సాయంత్రం అందరికీ ఒకే టైమ్‌లో డ్యూటీ అయిపోతుండటంతో రద్దీ మరింత పెరుగుతోంది. రైలు రాగానే తోసుకుంటూ ఎక్కాల్సి వస్తోందని, రద్దీ సమయాల్లో రైళ్లను పెంచితే ఈ సమస్య తీరుతుందని పలువురు కోరుతున్నారు.

## కారు అడ్డగించి రూ,40లక్షలు చోరీ

**24గంటల్లో కేసును చేధించిన పోలీసులు**

**నిందితుల వద్ద రూ,37లక్షల97వేలు నగదు, రెండు మొబైల్స్, కారు, బైక్ స్వాధీనం**



నిందితుల వద్ద స్వాధీనం చేసుకున్న నగదు చూపుతున్న ఎసిపి వెంకట్‌రెడ్డి, సిఐ రామక్రిష్ణ, డిఐ హనుమాన్‌గౌడ్

దుండిగల్, జూన్ 24 ప్రభాతవార్త : కారు అడ్డంగించి నగదును ఎత్తుకెళ్ళిన కేసును దుండిగల్ పోలీసులు 24గంటల్లో చేధించారు. నిందితులు అదుపులోకి తీసుకొని వారి వద్ద నగదు, మొబైల్స్, కారు, బైక్ స్వాధీనం చేసుకొని అరెస్ట్‌చేసి రిమాండ్‌కు తరలించారు. శనివారం సాయంత్రం దుండిగల్ పోలీస్‌స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఇందుకు సంబంధించిన వివరాలను ఎసిపి వెంకట్‌రెడ్డి తెలియజేశారు. కుత్బుల్లాపూర్ నియోజకవర్గం, సూరారం కాలనీకి చెందిన జాలా అనిల్‌కుమార్(37), ఆర్‌జికెకు చెందిన మోర్తా శివచరణ్(30), సూరారం కాలనీ చెందిన సాగి వెంకటరమణరాజు అలియాస్ పాండు(20), ఏపూరు రాజు(26)లు స్నేహితులు. భౌరంపేట పరిధిలోని దుర్గా ఆటోమొబైల్ గ్యారేజిలో అనిల్‌కుమార్ మాజీ ఉద్యోగి. గ్యారేజిలో పనిచేస్తున్న సమయంలో అనిల్‌కుమార్‌కు అక్కడ మెకానిక్‌గా పనిచేస్తున్న పందిగొట్ల మల్లేష్‌తో పరిచయం ఏర్పడి స్నేహితులై య్యారు. కాగా శుక్రవారం ఉదయం 6గంటలకు గ్యారేజి అకౌంటెంట్ సాయిరామ్ మల్లేష్‌తో కలిసి కారు (టిఎస్22టి5200)లో మాదాపూర్‌లోని హైటెక్‌సిటికి వెళ్ళి ఓ వ్యక్తి వద్ద రూ,40లక్షలు తీసుకొని తిరిగి గ్యారేజికి బయలుదేరారు. ఈవిషయాన్ని మల్లేష్ తన స్నేహితుడు అనిల్‌కుమార్‌కు చేరవేసాడు. అనిల్‌కుమార్ తన స్నేహితులు శివచరణ్, రాజులను బైక్‌పై పంపి బౌరంపేట జెకె.గార్డెన్ సమీపంలో కారును అడ్డగించారు. కారులో ఉన్న అకౌంటెంట్ సాయిరామ్‌ను బెదిరించి నగదు బ్యాగును తీసుకొని పరారైయ్యారు. దీంతో బాధితులు పోలీసులను ఆశ్రయించి ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తును వేగవంతం చేశారు. మాజీ ఉద్యోగి అనిల్‌కుమార్‌ను అదుపులోకి తీసుకొని విచారించగా నేరం అంగీకరించడంతో మిగితా నిందితులను సైతం అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద రూ,39లక్షల97వేల నగదు, రూ,1లక్షా70వేల విలువ గల రెండు సెల్‌ఫోన్లు, కెటిఎం బైక్, కారును స్వాధీనం చేసుకొని నిందితులను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. రాబరీ కేసును 24గంటల్లో చేధించిన దుండిగల్ పోలీసు సిబ్బందిని అభినందించారు. ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్ళి రివార్డులు అందజేస్తామన్నారు. సమావేశంలో సిఐ రామక్రిష్ణ, డిఐ హనుమాన్‌గౌడ్, ఎస్సైలు శ్రీనివాస్, రాజేష్ పాల్గొన్నారు.

## హైటెన్షన్ వైర్లు తాకి పెయింటర్‌కు గాయాలు

యూసుఫ్‌గూడ, జూన్ 24, ప్రభాతవార్త : శ్రీరామ్‌నగర్‌లో ఓ ఇంటికి పెయింటింగ్ వేస్తూ ప్రమాద వశాత్తు హైటెన్షన్ వైర్లు తగిలి ప్రమాదానికి గురైన సంఘటన బోరబండ పోలీస్ స్టేషన్ పరిదిలో చోటు చేసుకుంది. శనివారం మధ్యాహ్నం శ్రీరామ్‌నగర్‌లోని యాదుళ్ళకు చెందిన ఇంటికి పెయింటింగ్ వేస్తుండగా ఇంటి పైనుంచి వెళ్తున్న హైటెన్షన్ వైర్లు తగిలి పెయింటర్ మహ్మద్‌ఇక్బాల్(30) అనే వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే స్థానికులు గాంధీ ఆసుపత్రికి చికిత్స నిమిత్తం తరలించారు. బోరబండ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

## ఉజ్జయినీ మహాకాళీ జాతర వైభవంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు

**ఆలయ ఈఓ గుత్తా మనోహార్ రెడ్డి**



ఉజ్జయినీ మహాకాళీ ఆలయంలో విలేఖరుల సమావేశంలో వివరాలు వెల్లడిస్తున్న ఈ ఓ మనోహార్‌రెడ్డి

బేగంపేట జూన్ 24,ప్రభాతవార్త : సికింద్రాబాద్ ఉజ్జయినీ మహాకాళీ అమ్మ వారి ఆషాడ బోనాల ఉత్సవాలను అంగ రంగ వైభవంగా నిర్వహించేందుకు అన్ని రకాలైన ముందస్తు ఏర్పాట్లు చేస్తున్నామని ఆలయ ఈ ఓ గుత్తా మనోహార్ రెడ్డి తెలియజేసారు.శనివారం దేవాలయంలో ధర్మకర్తల మండలి సభ్యులతో కల్సి ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో ఆయన వివరాలను వెల్లడించారు.మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ ఆధ్వర్యంలో జులై 9,10వ తేదీల్లో జరగనున్న శ్రీఉజ్జయినీ మహాకాళీ ఆషాడ బోనాల జాతర కోసం వివిధ శాఖల అధికారులను సమన్వయం చేసుకుంటూ భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా అన్ని ఏర్పాట్లు చేస్తున్నట్లు ఆయన వెల్లడించారు.

**నేడు ఉజ్జయినీ మహాకాళీ ఘటోత్సవాలు..** లష్కర్ ప్రజలు ఎప్పుడెప్పుడా అని ఎదురు చూస్తున్న సికింద్రాబాద్ శ్రీఉజ్జయినీ మహాకాళీ అమ్మ వారి ఆషాడ బోనాల జాతర రానే వచ్చింది. ఈ నెల 25వ తేదీ అమ్మ వారి ఘటోత్సవాలు ప్రారంభం కానున్నాయి.అమ్మ వారి ఘటోత్సవాలతోనే అమ్మవారి బోనాల జాతర ప్రారంభమైనట్లుగా భావిస్తారు. మహాకాళీ అమ్మ వారి ఘటోత్సవాలలో భాగంగా ఆదివారం ఉదయం గం 8లకు అమ్మ వారి ఆలయ అనువంశిక ధర్మకర్తలు,సేవాదారులు కలిసి అమ్మ వారికి పసుపు, కుంకుమ సమర్పించి ఒడిబియ్యంతో ఒడిని నింపుతారు. ఈ జాతరలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ప్రతి భక్తుడికి అమ్మవారి దర్శనం ప్రశాంతంగా అందాలని, అమ్మ వారికి ప్రత్యేక పూజలు చేసారు.

## దంచికొట్టిన వాన

**రోడ్డుపై నిలిచిన నీరు.. పలుచోట్ల ట్రాఫిక్ జాం**

**మరో 24గంటల వర్షాలు పడే అవకాశం ఉందన్న వాతావరణశాఖ**



హైదరాబాద్,జూన్ 24,ప్రభాతవార్త: హైదరాబాద్‌లో శనివారం సాయంత్రం భారీ వర్షం కురిసింది. ఖైరతాబాద్, ఎర్రమంజిల్ ,పంజాగుట్ట, కాలాపత్తర్, చంపాపేట్, సైదాబాద్, సరూర్‌నగర్, సంతోష్ నగర్, కోఠి, అబిడ్స్, బేగంబజార్, నాంపల్లి, బషీర్‌బాగ్, మల్కాజ్‌గిరి, నేరేడ్‌మెట్, కుషాయిగూడ, కూకట్‌పల్లి, కెపిహెచ్‌బి, హైదర్‌నగర్, నిజాంపేట్, ప్రగతినగర్, బాచుపల్లి, మేడ్చల్, గండి మైసమ్మ, దుండిగల్, బహదూర్‌పల్లి, సికింద్రాబాద్, బేగంపేట్,బోయిన్‌పల్లి ,అల్వాల్, తిరుమలగిరి, చిలకలగూడ, మారేడుపల్లి, ముషీరాబాద్, ఆర్టీసీ క్రాస్‌రోడ్, చిక్కడపల్లి ,విద్యానగర్ , ఆడిక్‌మెట్, గాంధీ నగర్, రాంనగర్, నాచారం, మల్లాపూర్ తదితర ప్రాంతాల్లో వర్షం కురిసింది. దీంతో వివిధ పనుల మీద బయటకు వచ్చేన వారి తడిసి ముద్దయ్యారు. కొన్ని చోట్ల రహదారులపై నీరు నిల్వడంతో ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది.పలుచోట్ల విద్యుత్ అంతరాయం ఏర్పడింది.దీంతో జిహెచ్‌ఎంసి సిబ్బందిని అలెర్ట్ చేసింది. మరో 24గంటలపాటు భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని అత్యవసరమైతే తప్పా బయటకు రావద్దని ప్రజలను హెచ్చరించింది.

## వర్షాలకు అధికారులు అప్రమత్తంగా ఉండాలి

**డిప్యూటీ మేయర్ శ్రీలత శోభన్ రెడ్డి**



జిహెచ్‌ఎంసీ అధికారులతో మాట్లాడుతున్న డిప్యూటీ మేయర్ శ్రీలత శోభన్‌రెడ్డి

తార్నాక, జూన్ 24 ప్రభాతవార్త: వర్షాలకు అధికారులు అప్రమత్తంగా ఉండి ప్రజలకు ఇబ్బందులు తలెత్తకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని నగర డిప్యూటీ మేయర్ శ్రీలత శోభన్ రెడ్డి పేర్కొన్నారు. ఈ మేరకు డిప్యూటీ మేయర్ శ్రీలత శోభన్‌రెడ్డి, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు మోతె శోభన్ రెడ్డి జిహెచ్‌ఎంసీ, జలమండలి అధికారులతో తార్నాకలోని క్యాంపు కార్యాలయంలో సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వారు అధికారులకు పలు సూచనలు చేశారు. రానున్న వర్షాలను దృష్టిలో ఉంచుకొని ముందుస్తుగా డ్రైనేజీ, నాలాల పూడిక తీత పనులను పూర్తి చేసుకోవాలని సూచించారు. మ్యాన్ హోల్, డ్రైనేజీ మూతలను వెంటనే తనిఖీలు చేసి శిథిలావస్థకు చేరుకున్న వాటిని తొలగించి వాటి స్థానంలో కొత్తవాటిని వేయలని, ప్రమాదాలు జరుగకుండా తగిన జాగ్రత్తలను తీసుకోవాలన్నారు. మాన్‌సూన్ ఎమర్జెన్సీ టీం అవసరమైన వాహనాలు, ప్రజలను అందుబాటులో ఉండే విధంగా తగిన ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జీహెచ్‌ఎంసీ ఏఈ వెంకటేష్, జలమండలి ఏఈలు కృష్ణప్రసాద్, నిఖిత తదితరులు పాల్గొన్నారు.

## నిమ్స్‌కు ప్రపంచస్థాయి గుర్తింపు తీసుకురావాలి



ఆసుపత్రి సిబ్బందితో డైరెక్టర్ బీరప్ప

**ఆసుపత్రి డైరెక్టర్ నగరి బీరప్ప**

హైదరాబాద్, జూన్ 24,ప్రభాత వార్త: నిజాం ఇనిస్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ (నిమ్స్)కి ప్రపంచస్థాయి గుర్తింపు తీసుకురావాలని ఆసుపత్రి డైరెక్టర్ నగరి బీరప్ప అన్నారు. కిందిస్థాయి సిబ్బంది నుంచి ఉద్యోగులు, వైద్యులు అందరూ సమన్వయంతో కృషి చేస్తేనే అనుకున్న లక్ష్యాలను చేరుతామని అన్నారు. ఈనెల 14న ఆసుపత్రికి అనుసంధానంగా మరో భవనం దశాబ్ది బ్లాక్ నిర్మాణానికి సిఎం కెసిఆర్ శంకుస్థాపన చేశారని చెప్పారు. ఆకార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు ఆసుపత్రిలోని కిందిస్తాయి సిబ్బంది నుంచి ఉద్యోగులు ,వైద్యుల వరకు చాలా కృషి చేశారని దీంతోనే అతిపెద్ద కార్యక్రమం ఎలాంటి లోటుపాట్లు లేకుండా విజయవంతంగా పూర్తయిందన్నారు. ఈమేరకు శనివారం నిమ్స్‌లో వాలంటీర్లుగా పనిచేసిన వారి సేవలను గుర్తిస్తూ కృతజ్ఞత సభ ఏర్పాటు చేశారు. ఈసందర్భంగా సిబ్బందిని డైరెక్టర్ ప్రత్యేకంగా అభినందించి కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం డైరెక్టర్ మాట్లాడుతూ నిమ్స్‌లో వైద్యసేవలకోసం దేశంలోని పలు ప్రాంతాల నుంచి వస్తుంటారని ఇక్కడికి వస్తున్న సిబ్బంది నిరంతరం పనిచేస్తూ వేగంగా సేవలందిస్తున్నారన్నారు. రాష్ట్ర ప్రభుత్వం కూడా తమ సేవల్ని గుర్తించి అస్పత్రి విస్తరణ చేస్తుందని ప్రభుత్వ నమ్మకాన్ని వమ్ము చేయకుండా వేగంగా వైద్య సేవలు అందించి సిఎం కెసిఆర్, మంత్రి హరీష్‌రావు ప్రభుత్వానికి మంచిపేరు తీసుకురావాలని కోరారు. ఈకార్యక్రమంలో మెడికల్ సూపరింటెండెంట్ నిమ్మ సత్యనారాయణ, ఉద్యోగులు,సిబ్బంది పాల్గొన్నారు.

## నవరసభరితం-జనరంజకం చిన్నారుల నృత్యప్రదర్శనలు




రవీంద్రభారతి, జూన్ 24 ప్రభాతవార్త : ప్రముఖ సాంస్కృతిక కళాసంస్థ సాయిస్వరని మ్యూసిక్ అండ్ డ్యాన్స్ అకాడమీ ఆధ్వర్యంలో సంస్థ అధ్యక్షుడు, నాట్యగురువులు శ్రీనివాస్, తేజస్వినిల చిన్నారి శిష్యులు వందమంది వివిధ శాస్త్రీయ, సంప్రదాయ, జానపద, కళాప్రదర్శనలతో హాజరైన అశేష ప్రేక్షకులను మంత్రముగ్ధులను చేశారు. ముఖ్యంగా భరతనాట్యం, కూచిపూడి, సంగీత వీణా వేణువు తబల వాద్యకచేరీలు, సుమధురమైన గీతాలాపనలతో సంగీతలోకంలో విహరింపజేశారు. ఈ కళాప్రదర్శనల్లో చిన్నారి కళాకారిణి మేడిపల్లి అక్షిత కూచిపూడి నృత్యప్రదర్శన సంపూర్ణ పరిణతి చెందిన సీనియర్ కళాకారులకు ఏవిధంగా తీసిపోపిరీతిలో వివిధ అంశాలతో శృతి లయబద్ధంగా, అద్భుత పదవిన్యాసం, హావభావాలతో కడురమణీయంగా, నవసరభరితం-జనరంజకంగా నృత్యాభినయం కావించి ఆహుతుల హర్షధ్వానాల మధ్య శుభాశీస్సులు, అభినందనలు అందుకుంది.

## గచ్చిబౌలి డిఈ తీరుకు నిరసనగా విద్యుత్ ఉద్యోగుల ధర్నా



గచ్చిబౌలి డిఈ కార్యాలయం ముందు ఆందోళన చేపట్టిన విద్యుత్ ఉద్యోగులు

గచ్చిబౌలి, జూన్ 24 ప్రభాతవార్త : సమీక్షా సమావేశంలో లైన్‌మెన్‌ను తిట్టడమే కాకుండా సస్పెండ్ చేయడాన్ని నిరసిస్తూ గచ్చిబౌలి డిఈ కార్యాలయం ముందు టిఎస్ఎస్‌పిడిసిఎల్ ఉద్యోగులు ధర్నా చేపట్టారు. గచ్చిబౌలి డిఈ గోపాలక్రిష్ణ తీరుకు వ్యతిరేఖంగా ఈ ఆందోళన కొనసాగించారు. శనివారం గచ్చిబౌలి డిఈ కార్యాలయం ముందు చేపట్టిన ఈ ఆందోళనలో లైన్ ఇన్స్‌పెక్టర్లు, లైన్‌మెన్లు, జెఎల్‌ఎం, పిఎంఆర్‌లు, జెఎఓ, జూనియర్ అసిస్టెంట్‌లు విధులు బహిష్కరించి ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తారానగర్ సబ్ స్టేషన్ పరిధిలో జి.వెంకట్‌రెడ్డి లైన్ ఇన్స్‌పెక్టర్‌గా పనిచేస్తున్నాడని, ముగ్గురు లైన్‌మెన్ల పోస్టులు ఖాళీగా ఉన్నా ప్రైవేటు వ్యక్తుల సహకారంతో బిల్లుల కలెక్షన్ సజావుగా చేపడుతున్నాడని అన్నారు. కాగా ఈనెల 22వ తేదీన గచ్చిబౌలి డిఈ గోపాలక్రిష్ణ సక్సెస్ రివ్యూ మీటింగ్ నిర్వహించడంతో వెంకట్‌రెడ్డి సమావేశానికి హాజరయ్యాడని తెలిపారు. కాగా సమావేశంలో బిల్లుల కలెక్షన్ల విషయంలో మాట్లాడుతుండగా, డిఈ గోపాలక్రిష్ణ తిట్టడంతో మనస్థాపానికి గురైన వెంకట్‌రెడ్డి సమావేశం నుంచి వెళ్లిపోయాడని అన్నారు. సమావేశం నుంచి బయటకు వెళ్లిపోయా డనే కారణంతో 23వ తేదీన లైన్ ఇన్స్‌పెక్టర్ వెంకట్‌రెడ్డిని సస్పెండ్ చేస్తూ డిఈ గోపాలక్రిష్ణ ఆర్డర్ ఇచ్చారన్నారు. లైన్‌మెన్ల పోస్టులు ఖాళీగా ఉన్నా అదనపు పనిని బుజాన వేసుకొని పనిచేస్తుంటే సస్పెండ్ చేయడం అన్యాయమంటూ విద్యుత్ ఉద్యోగుల యూనియన్లు, సిఐటియు, ఎస్‌సిఎస్‌టి అసోసియేషన్ల ఆధ్వర్యంలో విద్యుత్ ఉద్యోగులు విధులు బహిష్కరించి ధర్నా చేపట్టారు. వెంకట్‌రెడ్డి మీద చేపట్టిన సస్పెన్షన్‌ను వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు రామ్మోహన్, శ్యామ్‌సుందర్, గోపాల్, శ్రీను, నర్సయ్య, రాంచందర్ తదితరులు పాల్గొన్నారు.

## ఐసీఎస్ఎస్ఆర్ సేవలను వినియోగించుకోవాలి

**ప్రొ.రవీందర్ యాదవ్**



ఓయూసీఐఎస్ ప్రాంగణాన్ని ప్రారంభిస్తున్న వైస్ చాన్స్‌లర్ ప్రొ.రవీందర్ యాదవ్ చిత్రంలో రిజిస్టార్ ప్రొ.లక్ష్మినారాయణ

తార్నాక, జూన్ 24 ప్రభాత వార్త: పరిశోధక విద్యార్థులు ఐసీఎస్ఎస్ఆర్ సేవలను వినియోగించుకోవాలని ఓ.యూ వైస్ చాన్స్‌లర్ ప్రొ.రవీందర్ యాదవ్ పేర్కొన్నారు. ఓ.యూ సెంటర్ ఫర్ ఇంటర్నేషనల్ స్టడీస్(ఓయూసీఐఎస్) ప్రాంగణంలో నెలకొల్పిన ఐసీఎస్ఎస్ఆర్..ఎస్ఆర్సి నూతన ప్రాంగణాన్ని వైస్ చాన్స్‌లర్ ప్రారంభించారు. అనంతరం వైస్ చాన్స్‌లర్ ప్రొ.రవీందర్ యాదవ్ మాట్లాడుతూ పరిశోధక విద్యార్థులకు మెరుగైన సేవలు అందించేందుకు ఐసిఎస్ఎస్ఆర్ డైరెక్టర్ ప్రొ.బి.సుధాకర్ రెడ్డి చేస్తున్న ప్రయత్నాలను అభినందించారు. ఓ.యూ నుంచి పూర్తి సహాయసహకారాలు ఉంటాయన్నారు. సామాజిక శాస్త్రాల పరిశోధనను ప్రోత్సహించేందుకు ఐసీఎస్ఎస్ఆర్‌ను ప్రారంభించామని ప్రొ.సుధాకర్ రెడ్డి పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో రిజిస్టార్ ప్రొ.లక్ష్మినారాయణ, ఓ.యూ సీఐఎస్ డైరెక్టర్ ప్రొ.కృష్ణకుమార్, ప్రొ.జెఎల్ఎన్‌రావు తదితరులు పాల్గొన్నారు.

## మార్ఫింగ్ చేసిన ఆడియోతో వేధిస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలి

**గచ్చిబౌలి పోలీసులకు పాడి కౌశిక్‌రెడ్డి ఫిర్యాదు**

గచ్చిబౌలి, జూన్ 24 ప్రభాతవార్త : మార్ఫింగ్ చేఉసిన ఆడియో రికార్డింగులతో తన తనను వేధింపులకు గురిచేస్తూ తన పరువుకు భంగం కలిగిస్తున్న యూట్యూబ్ ఛానళ్లపై, వ్యక్తులపై చర్యలు తీసుకోవాలని కోరుతూ ఎమ్మెల్సీ, ప్రభుత్వ విప్ పాడి కౌశిక్‌రెడ్డి శనివారం గచ్చిబౌలి పోలీస్ స్టేషన్‌లో పిర్యాదు చేశాడు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ దశాబ్ది ఉత్సవాల వేడుకల్లో భాగంగా ఈ నెల 22వ తేదీన హుజురాబాద్ పట్టణంలో అమరవీరుల సంస్మరణ దినోత్సవాన్ని నిర్వహించామని, అక్కడికి వచ్చిన ప్రజలను ఉద్దేశ్యించి మాట్లాడడం జరిగిందన్నారు. అక్కడి నుంచి తాను హుజురాబాద్‌లోని తన నివాసానికి వెళ్లిపోయానని, కాగా ప్రజలతో మాట్లాడే సమయంలో ఓ గుర్తు తెలియని వ్యక్తి తన ప్రసంగాన్ని వీడియో తీశాడని, తాను ఇంటికి వెళ్లిన 10 నిమిషాల తరువాత శివరాంరెడ్డి అనే వ్యక్తి ఫోన్ చేసి జిఎస్ ఆర్ యూట్యూబ్ ఛానల్ నుంచి మాట్లాడుతున్నాని, తన వీడియోలు ఎడిటింగ్ చేసి ఛానల్‌లో ప్రసారం చేస్తానని బెదిరించాడన్నారు. తన మనిషిని ఇంటికి పంపిస్తానని చెప్పాడని, కొద్దిసేపటి తరువాత తన ఇంటికి శివరాంరెడ్డి మనిషి రాగా, తాను మాట్లాడలేదని అన్నాడు. అనంతరం హైదరాబాద్‌లో ముఖ్యమంత్రి కెసిఆర్ ప్రారంభోత్సవం చేస్తున్న అమరవీరుల స్థూపం ప్రారంభోత్సవానికి వెళ్లినట్లు తెలిపాడు. దీనిపై పోలీసులు చర్యలు తీసుకోవాలని కోరుతూ గచ్చిబౌలి ఇన్స్‌పెక్టర్ సురేష్‌కు పిర్యాదు చేశారు.

## లలిత సహాసార్చన, హన్‌మాన్ చాలీసా పారాయణం



బేగంబజార్, జూన్ 24 ప్రభాతవార్త: చాదర్ ఘాట్ రామాలయం ట్రస్ట్ ఆధ్వర్యంలో లలిత సహాసార్చన,హన్‌మాన్ చాలీసా పఠనం చేశారు.రామాలయంలో నిర్వహించిన హన్‌మాన్ చాలీసా,లలిత అర్చన సుమారు 200మంది మహిళాలు పాల్గొన్ని పరాయణం చేశారు. ఈకార్యక్రమంలో డాక్టర్ అనంత లక్ష్మి, శాంతమ్మ,ఫౌండర్ ట్రస్టీ ముత్యాల గోవింద్ రాజు,చైర్మన్ ప్రొఫెసర్ డాక్టర్ బాగయ్య, మహేష్,రాజేందర్,సాయిబాబా పాల్గొన్నారు.

## రాజ్యాంగ ఫలాలు నేటికీ కూడా ఎస్సీ, ఎస్టీలకు అందడం లేదు

**మాజీ తెలంగాణ మానవహక్కుల కమిషన్ పూర్వ చైర్మన్ జస్టిస్ జి.చంద్రయ్య**

చిక్కడపల్లి, జూన్ 24 ప్రభాతవార్త: భారతరాజ్యాంగం కల్పించిన ఫలాలు నేటికీ కూడా ఎస్సీ,ఎస్టీలకు అందడం లేదని, ఇంకా ఈ వర్గాల పట్ల వివక్షత కొనసాగుతూనే ఉందని హైకోర్టు పూర్వ న్యాయమూర్తి, తెలంగాణ మానవహక్కుల కమిషన్ పూర్వ చైర్మన్ జస్టిస్ జి.చంద్రయ్య ఆవేదన వ్యక్తం చేశారు.ఇప్పటికీ షెడ్యూల్ కులాలు, తెగలు, వెనుకబడిన ప్రజలు సంతోషంగా లేరని అన్నారు. శనివారం బాగ్‌లింగంపల్లి సుందరయ్య విజ్ఞానకేంద్రంలో బంధ్ సొసైటీ అధ్యక్షుడు పల్లెల వీరస్వామి అధ్యక్షతన 'బహుజనుల ఆత్మీయ సభ' జరిగింది. ముఖ్యఅతిథిగా హాజరైన దక్షిణమధ్యరైల్వే పూర్వ చీఫ్ కమర్షియల్ మేనేజర్, విశ్రాంత ఐఆర్‌టిఎస్ అధికారి డాక్టర్ అప్పికట్ల భరత్‌భూషణ్ హాజరైన జస్టిస్ చంద్రయ్యను ఆత్మీయంగా సత్కరించి అభినందించారు. బడుగువర్గాలు జీవించే హక్కులు కోల్పోతున్నారని అన్నారు. పల్లెల వీరస్వామి మాట్లాడుతూ గత ప్రభుత్వాలు షెడ్యూల్ కులాలకు, తెగలకు వెనుకబడిన కులాలకు ఇచ్చిన అసైన్డ్ భూములను అభివృద్ధి పేరుతో లాక్కున్నారని, దళితులకు 3 ఎకరాల భూమి ఇస్తామని చెప్పిన ప్రస్తుత ప్రభుత్వం ఇవ్వకపోగా ఉన్న కొద్దిపాటి భూములను కూడా గుంజుకుని, జీవించే హక్కును కూడా కాలరాస్తున్నారని విమర్శించారు. ఎన్టీపీసీ పూర్వ డీజీఎం డాక్టర్ ఆరేపల్లి రాజేంద్ర, మానవహక్కుల వేదిక అధ్యక్షుడు అగ్రిప్ప, ప్రొఫెసర్ నతానియేలు, ప్రముఖ వైద్యులు డాక్టర్ రాజమౌళి, శ్యామ్‌లాల్, వనపాక నర్సింహా, గొల్లపల్లి దయానంద్, మాలమహానాడు ఐక్యవేదిక అధ్యక్షుడు అనంత్‌రామ్, బిఎస్‌పి నేత రాజయ్య తదితరులు పాల్గొన్నారు.

## వెన్నెలగడ్డలో కాంగ్రెస్ నాయకుల పాదయాత్ర



యెన్నా చెరువును పరిశీలిస్తున్న నర్సారెడ్డి భూపతిరెడ్డి

పేట్‌బషీరాబాద్, జూన్24 ప్రభాతవార్త: కుత్బుల్లాపూర్ నియోజకవర్గం జీడిమెట్ల డివిజన్ పరిధిలోని వెన్నెలగడ్డలో శనివారం టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నర్సారెడ్డి భూపతిరెడ్డి పాదయాత్ర నిర్వహించి ఇంటింటికి తిరుగుతూ స్థానికుల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా భూపతిరెడ్డి మాట్లాడుతూ వెన్నెలగడ్డలోని యెన్నా చెరువును సందర్శించానని చెరువు మొత్తం డ్రైనేజీ నీటితో నిండిపోయి దుర్గంధం వెదజల్లుతోందని, ఈ దుర్వాసనతో స్థానికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని మండిపడ్డారు. అంతేకాకుండా చెరువులో పేరుకుపోయిన గుర్రపు డెక్క వల్ల దోమలు వృద్ధి చెంది సమీపంలోని ప్రజలు అనారోగ్యాల బారినపడుతున్నారని ఆరోపించారు. ఇప్పటికైనా అధికారులు, స్థానిక ప్రజా ప్రతినిధులు యెన్నా చెరువు సుందరీకరణ పనులు చేపట్టి స్థానికుల సమస్యను పరిష్కరించాలన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ ఏ-బ్లాక్ అధ్యక్షుడు బండి శ్రీనివాస్‌గౌడ్,కుత్బుల్లాపూర్ మండల మాజీ అధ్యక్షుడు బొంగునూరి శ్రీనివాస్‌రెడ్డి, నాయకులు సదానందం, సమీర్‌ఖాన్, రాధకృష్ణ, జంగారెడ్డి, యాదిరెడ్డి, నవీన్‌రెడ్డి, రహ్మతుల్లా, భరత్‌గౌడ్, పూర్ణచందర్, ధృవ, భాస్కర్, దుర్గాప్రసాద్, అరుణ్‌రెడ్డి, లక్ష్మణ్, సాయి, నవీన్, మల్లారెడ్డి, కార్యకర్తలు పాల్గొన్నారు.

## తాను ఎమ్మెల్యేగా గెలిచాకే అంబర్‌పేటలో అభివృద్ధి

**ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్**



నరేందర్‌నగర్‌లో మంచినీటి పైప్‌లైన్ పనులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్, స్థానిక కార్పొరేటర్ విజయ్‌కుమార్‌గౌడ్

హైదరాబాద్,జూన్ 24 ప్రభాతవార్త : తాను ఎమ్మెల్యేగా గెలిచాకే అంబర్‌పేట నియోజకవర్గం అభివృద్ధి చెందిందని ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ అన్నారు. శనివారం అంబర్‌పేట డివిజన్, నరేందర్‌నగర్‌లో 6లక్షల వ్యయంతో నూతన మంచినీటి పైప్‌లైన్ పనులను స్థానిక కార్పొరేటర్ విజయ్‌కుమార్‌గౌడ్‌తో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా స్థానిక బస్తీలో పర్యటించి ప్రజల సమస్యలు తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ తాను ఎమ్మెల్యేగా గెలిచాకనే అంబర్‌పేటను అన్ని విధాలుగా దశలవారిగా అభివృద్ధి చేస్తున్నట్లు చెప్పారు.గతంలో ఇక్కడ గెలిచిన నేతలు అభివృద్ధిని పూర్తిగా విస్మరించారని విమర్శించారు. బస్తీలు, కాలనీల్లో రోడ్లను అభివృద్ధి చేసేందుకు సమగ్ర ప్రణాళికతో ముందుకు పోతున్నామని చెప్పారు. కార్పొరేటర్ విజయ్‌కుమార్‌గౌడ్ మాట్లాడుతూ అంబర్‌పేట డివిజన్ పరిధిలోని ప్రతి బస్తీలతో అఈవసరమైన ప్రతి చోట నూతన డ్రైనేజీ లైన్లు, మంచినీటి పైప్‌లైన్లు ఏర్పాటు చేసి నూతన సిసి రోడ్డు వేయడం జరుగుతున్నదని చెప్పారు. ఈ కార్యక్రమంలో అధికారులు ఎఇ యాదగిరిరెడ్డి, బిఆర్‌ఎస్ నాయకులు జాఫర్, స్వామి, సరోజనమ్మ, స్వాతి, జయమ్మ, శారత, లక్ష్మీ తదితరులు పాల్గొన్నారు.

## ప్రపంచ దేశాలకు ఆదర్శంగా భారతదేశంను తీర్చిదిద్దిన ఘనత బీజేపీదే

**బీజేపీ ఓబీసీ మోర్చా జాతీయ అధ్యక్షులు, రాజ్యసభ సభ్యులు డాక్టర్ కే.లక్ష్మణ్**




నేవీ, ఆర్మీ రిటైర్డ్ ఉద్యోగులను పార్టీలోకి ఆహ్వానిస్తున్న లక్ష్మణ్

ధర్నాచౌక్, జూన్ 24, ప్రభాతవార్త: ప్రపంచ దేశాల ముందు మన దేశాన్ని ఆదర్శవంతంగా నిలబెట్టిన ఘనత బీజేపీకే దక్కుతుందని బీజేపీ ఓబీసీ మోర్చా జాతీయ అధ్యక్షులు డాక్టర్ కే.లక్ష్మణ్ స్పష్టం చేశారు. శనివారం కవాడిగూడడివిజన్ బీజేపీ ఆధ్వర్యంలో మేధావుల సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా రిటైర్డ్ నేవీ ఉద్యోగి కెప్టెన్ సుదీర్‌రెడ్డి ఆధ్వర్యంలో పలువురు నేవీ ఉద్యోగులు, ఆర్మీ రిటైర్డ్ ఉద్యోగులు బీజేపీ పార్టీలో చేరారు. వీరిని బీజేపీ కండువాలతో ఆహ్వానించిన అనంతరం లక్ష్మణ్ మాట్లాడుతూ నేవీ, ఆర్మీ ఉద్యోగులుగా దేశానికి సేవ చేసిన వారు బీజేపీలో చేరటం శుభపరిణామమని కొనియాడారు. దేశ ప్రధానిగా మోడీ పాలన దేశానికే ఆదర్శంగా నిలిచిందని, మోదీ తీసుకువచ్చిన సంస్కరణలు భావితరాలకు దిక్సూచిగా నిలుస్తాయని పేర్కొన్నారు. రాబోయే ఎన్నికలలో మూడోసారి బీజేపీని అధికారంలోకి తీసుకువచ్చేందుకు మేధావులు అందరూ సంఘటితం కావాలని పిలుపునిచ్చారు. తొమ్మిది సంవత్సరాల పాలనలో దేశ ప్రధాని మోదీ అనేక సంవత్సరాలుగా పెండింగ్‌లో ఉన్న ప్రధాన సమస్యలను పరిష్కరించారని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో కవాడిగూడ కార్పోరేటర్ రచనశ్రీ, రాంనగర్ కార్పోరేటర్ రవిచారి, బీజేపీ నాయకులు రమేష్‌రాం, వెంకటేష్, డివిజన్ అధ్యక్ష కార్యదర్శులు మహేందర్‌బాబు, ఏ. ప్రభాకర్, కేశవరాజు, బీజేవైఎం నగర మాజీ అధ్యక్షులు ఏ.వినయ్‌కుమార్, ఓబీసీ మోర్చా నగర అధ్యక్షులు సలంద్రి శ్రీనివాస్ యాదవ్, జాయింట్ కన్వీనర్ నవీన్‌గౌడ్, నాయకులు వెంకటస్వామి, పరిమళకుమార్, శ్రీనివాస్‌ముదిరాజ్, పి.ఎన్.చారి, శివరాజ్, గంట శ్రీనివాస్ కుమార్‌గౌడ్, అనిల్, హరీష్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## గొప్ప పరిపాలనాధక్షులు, బహుభాషాకోవిదులు పైడి లక్ష్మయ్య

**తమిళనాడు పూర్వ గవర్నర్ పిఎస్.రామ్మోహన్‌రావు**



పురస్కారాలను ప్రదానం చేస్తున్న తమిళనాడు పూర్వ గవర్నర్ పిఎస్.రామ్మోహన్‌రావు, ఎం.కె.రాము, నరసింహప్ప

చిక్కడపల్లి, జూన్ 24 ప్రభాతవార్త: ప్రజాసేవకులుగా, పరిపాలనాదక్షులుగా, బహుభాషా కోవిదులు, సుప్రసిద్ధులు పైడి లక్ష్మయ్య అని తమిళనాడు పూర్వ గవర్నర్ పిఎస్.రామ్మోహన్‌రావు అన్నారు. రసమయి సంస్థ, డాక్టర్ పైడి లక్ష్మయ్య ట్రస్ట్ సంయుక్త ఆధ్వర్యంలో డాక్టర్ పైడి లక్ష్మయ్య, డాక్టర్ పిఎల్.సంజీవరెడ్డి స్మారక పురస్కారాల ప్రదానోత్సవ కార్యక్రమం నిర్వాహక సంస్థ అధినేత, ప్రముఖ కవి డాక్టర్ ఎం.కె.రాము ఆధ్వర్యంలో శనివారం రాత్రి చిక్కడపల్లి శ్రీ త్యాగరాయ గానసభలో జరిగింది. శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయం పూర్వ వైస్‌చాన్సలర్ ఆచార్య కొలకలూరి ఇనాక్ అధ్యక్షతన జరిగిన ఈ ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా రామ్మోహన్‌రావు హాజరై ఈ పురస్కారాలను దూరదర్శన్ విశ్రాంత అదనపు డైరెక్టర్ జనరల్ డాక్టర్ అనంత పద్మనాభరావు, కళారత్న, ప్రముఖ కవి డాక్టర్ బిక్కికృష్ణ, తెలంగాణ రచయితల సంఘం అధ్యక్షుడు డాక్టర్ నాళేశ్వరం శంకరం, స్వర్ణభారతి ట్రస్ట్ అధినేత్రి దీపా వెంకట్‌లకు అందించి గౌరవించారు. పార్లమెంట్‌లో వివిధ విషయాలపై చర్చలలో పైడి లక్ష్మయ్య పాల్గొని నిర్మాణాత్మకమైన సూచనలు చేసి ఉత్తమ రాజకీయవేత్తగా పేరును సంపాదించారన్నారు. ప్రాత:స్మరణీయులు పైడి లక్ష్మయ్య, పిఎల్.సంజీవరెడ్డి అని అన్నారు. కార్యక్రమానికి వ్యాఖ్యాత్రిగా ఎపి కళారత్న అవార్డుగ్రహీత ఎంకెఆర్.ఆశాలత వ్యవహరించగా కార్యక్రమానికి ముందు సలాడి మృణాళిని శిష్యబృందంచే 'భాగీరథీ విలాసం' నృత్యరూపకం జరిగింది.

## భారతీయ వసుదైక కుటుంబానికి నిదర్శనం ఆదర్శదంపతులు

రవీంద్రభారతి, జూన్ 24 ప్రభాతవార్త : భారతీయ సంస్కృతిలో వసుదైక కుటుంబానికి ఎంతో ప్రత్యేక ఉందని, అందుకు నిదర్శనే ఆదర్శదంపతులని, అలాంటి వారే డా. నడింపల్లి కృష్ణ, లక్ష్మి దంపతులని, ఆ ప్రముఖులను ఆదర్శదంపతులు, వంశీ గ్లోబల్ లెజండరీ అవార్డులతో సత్కరించుకోవడం ఎంతో భావ్యంగా ఉందని వక్తలన్నారు. తెలంగాణ ప్రభుత్వం భాషా సాంస్కృతికశాఖ సౌజన్యంతో వంశీ ఆర్ట్ థియేటర్స్, ఎం.ఆర్.సి గ్రూప్, వంశీకల్చరల్ అండ్ ఎడ్యుకేషన్ ట్రస్ట్ సంయుక్త ఆధ్వర్యంలో రవీంద్రభారతిలోని సమావేశ మందిరంలో ప్రముఖ సాహితీవేత్త డా. ఓలేటి పార్వతీశం సభాధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా విచ్చేసిన ప్రథమ దత్తావతారమైన శ్రీపాద శ్రీవల్లభులు పూజ్యశ్రీ గోపాలకృష్ణానంద స్వామీజీ దంపతులు గౌరవ అతిథులు డా. ఎం.ఆర్.చౌదరి, సరస్వతీ ఉపాసకుడు దైవజ్ఞశర్మ, కళాబ్రహ్మ శిరోమణి డా. వంశీరామరాజు, లయన్ లక్ష్మీప్రసాద్ తదితరులతో కలిసి జ్యోతిప్రకాసనంచేసి విదేశాల్లో భారతీయ సంస్కృతిని, సంప్రదాయాలను ఫరిడవిల్లింపజేస్తున్న ప్రముఖ మూర్తులు డా. నడింపల్లి కృష్ణ, నడింపల్లి లక్ష్మి దంపతులను ఘ సత్కరించి ఆదర్శదంపతుల పురస్కారం, వంశీ గ్లోబల్ లెజండరీ అవార్డు-2023లను ప్రదానంచేసి ఎంతగానో అభినందించారు.

## పాఠశాలకు వాటర్ ఫిల్టర్, వంట సామాగ్రి పంపిణీ



వంట సామాగ్రిని అందజేస్తున్న డిప్యూటీ మేయర్ ధన్‌రాజ్‌యాదవ్

నిజాంపేట్, జూన్24 ప్రభాతవార్త: కుత్బుల్లాపూర్ నియోజకవర్గం నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధి ప్రగతినగర్‌లోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల హెడ్ మాస్టర్ కె.ఆశలతకు ఎన్ఎంసీ ఆర్గనైజర్ సెక్రెటరీ సాంబశివారెడ్డి ఆధ్వర్యంలో శనివారం డిప్యూటీ మేయర్ ధన్‌రాజ్ యాదవ్ చేతుల మీదుగా వంట సామాగ్రి, వాటర్ ఫిల్టర్లను అందజేశారు. ఈ సందర్భంగా ధన్‌రాజ్ యాదవ్ పాఠశాలలో విద్యార్థులకు ఎలాంటి అసౌకర్యాలు, ఇబ్బందులు కలిగినా తన దృష్టికి తీసుకువస్తే వెంటనే పరిష్కరించే విధంగా కృషి చేస్తానని హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో ఎన్ఎంసీ ఆర్గనైజర్ సెక్రెటరీ సాంబశివారెడ్డి, దశరథ్, హరి, ఉపాధ్యాయులు ప్రసన్న భారతి, శ్రీనివాస్‌రెడ్డి, దినకర్, భద్రయ్య, చెన్నయ్య, శ్యామలమ్మ పాల్గొన్నారు.

## చిత్రపురి కాలనీలో మౌలిక వసతుల కల్పనకు కృషి

**కౌన్సిలర్ వసంత్‌రావ్ చౌహాన్**



మణికొండ చిత్రపురి కాలనీ మున్సిపల్ పార్కులో బోర్ వేయిస్తున్న కౌన్సిలర్ వసంత్‌రావ్ చౌహాన్

నార్సింగి, జూన్ 24 ప్రభాతవార్త : మణికొండ మున్సిపాలిటీ పరిధిలోని చిత్రపురి కాలనీలో మౌళిక వసతుల కల్పనకు శక్తివంచన లేకుండా కృషి చేస్తున్నామని కౌన్సిలర్ వసంత్‌రావ్ చౌహాన్ పేర్కొన్నారు. శనివారం చిత్రపురి కాలనీలోని పార్కులో మున్సిపల్ నిధులతో బోర్ వేయించారు. ఈ సందర్భంగా వసంత్‌రావ్ మాట్లాడుతూ ఎన్నికల సమయంలో ఇక్కడి ప్రజలకు ఇచ్చిన ప్రతీ హామీని చేతల్లో చేసి చూపిస్తున్నామన్నారు. ముఖ్యంగా మంచినీరు, భూగర్భ డ్రైనేజి, వీధి దీపాలు, అంతర్గత రోడ్లు, పార్కులు, స్మశాన వాటికలు వంటి అభివృద్ధి పనులు వేగంగా చేపడుతున్నామని వివరించారు. స్థానిక ప్రజల అభిప్రాయం మేరకు ప్రాధాన్యత క్రమంలో అభివృద్ధి పనులు చేయిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ వల్లభనేని హైమాంజలి అనిల్, కాలనీ వాసులు అంజిబాబు, లోహిత్ కుమార్, ప్రశాంత్‌రెడ్డి, మల్లిఖార్జున్‌రెడ్డి, భాస్కర్, రమణ మూర్తి, బాలాజి తదితరులు పాల్గొన్నారు.

## రోడ్డుపై వర్షపు నీటిని తొలగించాలి



రోడ్డుపై నిల్వ ఉన్న వర్షపు నీరును పరిశీలిస్తున్న స్థానికులు

హైదరాబాద్, జూన్ 24 ప్రభాతవార్త: గోల్నాక డివిజన్‌లోని నెహ్రూనగర్‌లోగల కమెలా వద్దగల రోడ్డుపై వర్షపు నీరు నిల్వ ఉండటంతో వచ్చే పోయే వాహనందారులతోపాటు పాదచారులు పలు ఇబ్బందులకు గురవుతున్నారని డివిజన్ కార్పోరేటర్ దూసరి లావణ్యశ్రీనివాస్‌గౌడ్ ఆవేదన వ్యక్తం చేశారు. వెంటనే తగు చర్యలు తీసుకోవాలని ఈ మేరకు శనివారం ఆమె సంబంధిత అధికారులకు విజ్ఞప్తి చేశారు.

## కమ్యూనిటిహాల్ నిర్మాణం పనులకు శంఖుస్థాన



ఎస్.డి నగర్‌లో కమ్యూనిటిహాల్ నిర్మాణం పనులకు శంఖుస్థాన చేసిన ఎమ్మెల్యే టి.రాజాసింగ్,కార్పొరేటర్ రాకేష్‌జైస్వాల్

గోషామహల్, జూన్ 24ప్రభాతవార్త: ప్రజా సమస్యలను పరిష్కరించేందుకుగాను తన వంతు కృషి చేయడం జరుగుతుందని గోషామహల్ నియోజకవర్గం శాసన సభ్యులు టి.రాజాసింగ్ అన్నారు.శనివారం జాంబాగ్ డివిజన్ పరిధిలోని ఎస్‌డి నగర్ బస్తీలో నూతన కమ్యూనిటి హాల్ నిర్మాణం పనులకు స్థానిక కార్పొరేటర్ రాకేష్ జైస్వాల్‌తో కలిసి శంఖు స్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలో అంచెలంచెలుగా అభివృద్ధి పనులు చేపట్టడం జరిగిందన్నారు. కార్పొరేటర్ రాకేష్ జైస్వాల్ మాట్లాడుతూ హాట్ డవలప్ వెల్ఫేర్ అసోసియేషన్ కమిటి వినతి మేరకు స్థానిక ఎమ్మెల్యే రాజాసింగ్ సహకారంతో కమ్యూనిటిహాల్ నిర్మాణ పనులకు భూమి పూజ చేసినట్లు తెలిపారు. డివిజన్ పరిధిలో రహదారులు,డ్రైనేజీ, విద్యుత్ తదిత అభివృద్ధి పనులు చేయించినట్లు తెలిపారు.ఈకార్యక్రమంలో బిజెపి నాయకులు కె.రామకృష్ణ,స్థానికులు పాల్గొన్నారు.

## ఉద్యమ కారునికి ఘన నివాళులు అర్పించిన కంటోన్మెంట్ నేతలు



ప్రభాకర్ అంతిమ యాత్రలో పాడె మోస్తున్న టీటీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి ముప్పిడి

బేగంపేట జూన్ 24,ప్రభాతవార్త : ఆయనో ఉద్యమ కెరటం, తెలంగాణ ప్రత్యేక రాష్ట్ర సాధన సమయంలో ఉమ్మడి ఆంధ్ర రాష్ట్ర పాలకులపై పిడికిలి బిగించి ముందుకు నడిచిన వ్యక్తి.కంటోన్మెంట్ ప్రాంతంతో పాటు నగరంలోని పలు ప్రాంతాల వారు ఆయన పేరు చెప్పగానే ఇట్టే గుర్తు పట్టేంతగా గుర్తింపు తెచ్చుకున్నారు. కంటోన్మెంట్ వార్డు3 నుంచి మెంబర్‌గా పనిచేసారు. ఆయనే పి.ప్రభాకర్.ఇటీవల తెలంగాణా రాష్ట్ర దశాబ్ది ఉత్సవాల్లో సైతం ఆయన ఎంతో చురుగ్గా పాల్గొన్నారు.కంటోన్మెంట్ లో ఇటీవల నిర్వహించిన ప్రతి కార్యక్రమంలో ఆయన తెల్లని జుట్టు,తెల్లని చొక్కా,ప్యాంటుతో కనిపించారు.అయితే మెదడులో రక్తం గడ్డం కట్టడంతో సికింద్రాబాద్ పరిధిలోని ఓ ప్రయివేటు ఆస్పత్రిలో చేరారు అయన.త్వరగా కోలుకొని వస్తాడనుకున్న ప్రభాకర్ శుక్రవారం మధ్యాహ్నం ఈ లోకాన్ని విడిచి వెళ్లిపోయారు.ఈ వార్త కంటోన్మెంట్ తో పాటు వివిధ నియోజకవర్గాల్లో ఆయనతో సన్నిహితంగా ఉన్న వారిని తీవ్రంగా కలచివేసింది.ఆసుపత్రిలో మృతి చెందిన ఆయన పార్థీవ దేహాన్ని బాలంరాయిలోని ఇంటికి తరలించారు.ప్రభాకర్ కు భార్య ఇద్దరు కుమారులు,ఒక కుమార్తె ఉన్నారు.శనివారం ఉదయం మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ ప్రభాకర్ పార్థివ దేహం వద్ద నివాళులు అర్పించారు.అనంతరం కుటుంబసభ్యులను ఓదార్చారు. మల్కాజ్ గిరి ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావు శనివారం ఉదయం ప్రభాకర్ రావు పార్థివ దేహాన్ని సందర్శించి నివాళులు అర్పించడంతో పాటు ఆయన కుటుంబ సభ్యులను ఓదార్చారు.

**చిన్నతోకట్టలో ప్రభాకర్ అంత్యక్రియలు..** ఉద్యమ వీరుడు పి.ప్రభాకర్ అంత్యక్రియలు శనివారం బోయిన్‌పల్లి చిన్న తోకట్టలో నిర్వహించారు. బాలంరాయిలోని ఇంటి నుంచి బయలు దేరిన ప్రభాకర్ అంతిమ యాత్ర అన్నానగర్,బ్రూక్‌బాండ్,మస్తానా హోటల్,తాడ్‌బండ్ మీదుగా సాగింది.ఈ యాత్రలో అశేష జనవాహని పాల్గొని ఉద్యమ వీరునికి కన్నీటి వీడ్కోలు పలికారు.టీటీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి ముప్పిడి గోపాల్‌తో పాటు మర్రి రాజశేఖర్,గజ్జెల నాగేశ్, ఎర్రోళ్ల శ్రీనివాస్‌లు పాడెమోసి ప్రభాకర్‌తో తమకు ఉన్న సాన్నిహిత్యాన్ని గుర్తు చేసుకున్నారు.

## విద్యావ్యవస్థలు.. పరిశ్రమలు సమిష్టిగా పని చేస్తేనే దేశాభివృద్ధి



ఎంజిఐటి కళాశాలలో జరిగిన జాతీయ స్థాయి సదస్సును జ్యోతి ప్రజ్వల చేసి ప్రారంభిస్తున్న ప్రిన్సిపాల్ డాక్టర్ చంద్రమోహన్

నార్సింగి, జూన్ 24 ప్రభాతవార్త : భారతదేశం అవనిలో అగ్రగామిగా నిలువాలంటే దేశంలోని "విద్యా సంస్థలు-పరిశ్రమలు" సమిష్టిగా పని చేయాల్సిన అవసరం ఉందని టిసిఎస్ కంపనీ ముఖ్య నవకల్పన ప్రచారకులు డాక్టర్ పి.హెచ్. అనంత దేశిక్ పేర్కొన్నారు. శనివారం గండిపేటలోని ఎంజిఐటి కళాశాలలో గణిత,ఆంగ్ల, నిర్వాహణ శాస్త్రాల ఔచిత్యంపై జాతీయ స్థాయి సమావేశంను నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన అనంత దేశ్‌ముఖ్ మాట్లాడుతూ ప్రస్తుత పరిస్థితుల్లో ఇంజనీరింగ్ విద్యార్థులు అనేక సవాళ్లను అధిగమిస్తేనే భవిష్యత్తులో ఉన్నత ఉద్యోగాలలో రాణిస్తారని తెలిపారు. ఎప్పటికప్పుడు ఆధినక సాంకేతిక పరిజ్ఞానంను పెంచుకోవాలని, కమ్యూనికేషన్ స్కిల్స్‌ను పెంపొందించుకోవాలని సూచించారు. అనంతరం ప్రిన్సిపాల్ డాక్టర్ చంద్రమోహన్‌రెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు నిరంతరం శ్రమిస్తేనే విజయం సాధిస్తారని స్పష్టం చేశారు. పదవీ విరమణ చేస్తున్న ప్రొఫెసర్ రాజిరెడ్డి మాట్లాడుతూ ఎంజిఐటి కళాశాల ఆరంభం నుంచి తన సేవలను కళాశాల ఉన్నతికి విద్యార్థుల సర్వతోముఖాభివృద్ధికి త్రికరణశుద్ధిగా అందించా నని తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రొఫెసర్ శ్రీనివాస్‌రావ్, డాక్టర్ రాజా విశ్వనాథ్, ప్రొఫెసర్ సుధాకర్‌రెడ్డి పాల్గొన్నారు.

## కౌసిక్‌రెడ్డిని ఎమ్మెల్సీ పదవి నుంచి తొలగించాలి

సైఫాబాద్, జూన్ 24 ప్రభాతవార్త: హుజురాబాద్‌లో జిఆర్ఎస్ సోషల్ మీడియా కెమెరామెన్ అజయ్‌ముదిరాజ్‌పై దాడి చేసి చిత్రహింసలు పెట్టడమే కాకుండా ముదిరాజ్ కులాన్ని అసభ్యపదజాలంతో దూషించిన ఎమ్మెల్సీ పాడి కౌశిక్‌రెడ్డిపై తక్షణమే చర్యలు తీసుకోవాలని తెలంగాణ రాష్ట్ర ముదిరాజ్ సేవా సమాఖ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. కౌసిక్‌రెడ్డిని ఎమ్మెల్సీ పదవి నుంచి తొలగించాలని గవర్నర్‌కు సమాఖ్య విజ్ఞప్తి చేసింది. ముదిరాజ్ జాతిని అవమానించిన కౌసిక్‌రెడ్డి వెంటనే బహిరంగ క్షమాపణ చెప్పాలని సమాఖ్య నాయకులు బండి కృష్ణముదిరాజ్, పంజా మనోహర్‌ముదిరాజ్ శనివారం నాడిక్కడ పత్రికలకు విడుదల చేసిన ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. లేని పక్షంలో కౌసిక్‌రెడ్డిని బయట తిరగనీయబోమని ముదిరాజ్‌లంతా వెంబడించి తగిన బుద్ధి చెపుతారని హెచ్చరించారు. ఇప్పటికే ముదిరాజ్ కులస్తులు పలు పోలీస్ స్టేషన్‌లలో కౌసిక్‌రెడ్డిపై ఫిర్యాదు చేయడం జరిగిందన్నారు. కౌసిక్‌రెడ్డి వల్ల సిఎం కెసిఆర్‌కు, బిఆర్ఎస్ పార్టీకి చెడ్డ పేరు వస్తున్నదని పార్టీ పరువు పోతుందని హెచ్చరించారు.

## వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో దళిత బహుజన పార్టీ అన్ని స్థానాలకు పోటి

సైఫాబాద్, జూన్ 24 ప్రభాతవార్త: తెలంగాణ రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల్లో అన్ని ఎమ్మెల్యే స్థానాలకు దళిత బహుజన పార్టీ పోటి చేస్తుందని పార్టీ జాతీయ అధ్యక్షుడు వడ్డమూరి కృష్ణస్వరూప్ ప్రకటించారు. పోటీ చేసే అభ్యర్థులకు ఎన్నికల గుర్తు కప్పు, సాసరను కేటాయించాలని కోరుతూ ఈ మేరకు కేంద్ర ఎన్నికల కమిషన్ కార్యదర్శికి విజ్ఞప్తి చేయడం జరిగిందని చెప్పారు. ఈ సందర్భంగా ఢిల్లీలోని తెలంగాణ భవన్‌లో రాజ్యాంగ నిర్మాత డా.బి.ఆర్.అంబేద్కర్ విగ్రహానికి నివాళులు అర్పించిన తరువాత ఆయన మీడియాతో మాట్లాడారు. తెలంగాణలోని దొరలు, దోపిడీకులాల నేతృత్వంలోగల తోడు దొంగల పార్టీలైన బిఆర్ఎస్, బిజెపి, కాంగ్రెస్ పార్టీలను రానున్న ఎన్నికల్లో ఓడించడమే తమ లక్ష్యమన్నారు. 78 వసంతాల అగ్రకుల పాలకుల దోపిడీదారుల పాలనలో మేజార్టి దళిత బహుజన సమాజానికి అన్యాయం, విద్రోహమే జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ జాతీయ కార్యనిర్వాహక అధ్యక్షుడు వసంతపాటిల్, ముఖ్య సలహాదారు వి.ఎల్.రాజు తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థులు విద్యతోపాటు క్రీడలోరాణించాలి



విద్యార్థులకు ఆట సామాగ్రిని పంపిణి చేస్తున్న మహాలక్ష్మీరామన్‌గౌడ్

హైదరాబాద్, జూన్ 24 ప్రభాతవార్త: విద్యార్థులు విద్యను అభ్యసించడం తోపాటు క్రీడల్లో కూడా రాణించాలని హిమాయత్ నగర్ డివిజన్ కార్పోరేటర్ జి.మహాలక్ష్మీరామన్ గౌడ్ పిలుపు నిచ్చారు. క్రీడలు ఆరోగ్యానికి, ఉల్లాసానికి ఎంతో ఉపయోగపడతాయన్నారు. హిమాయత్ నగర్ డివిజన్‌లోని ముత్యాల్‌బాగ్‌లోగల సెయింట్ పీటర్స్ ప్రభుత్వ స్కూల్‌లో 4వ శనివారం 'నో బ్యాగ్స్ డే'ని పురస్కరించుకుని విద్యార్థులకు ఆట సామాగ్రిని పంపిణి చేసిన సందర్భంగా ఆమె మాట్లాడారు. విద్యార్థులను ఉత్తమ భారత భావి పౌరులుగా తీర్చిదిద్దాల్సిన బాధ్యత ఉపా ధ్యాయులపైన ఉందన్నారు. ఈ కార్యక్రమంలో బిజెపి రాష్ట్ర నాయకుడు రామన్‌గౌడ్, నగర నాయకులు నర్సింగ్‌గౌడ్, మహేష్, మల్లేష్, జాకీ, సాయి, హితేష్, భాను, నదీమ్ తదితరులు పాల్గొన్నారు.

## స్వచ్ఛంద సంస్థలు ముందుకురావాలి : జంపనప్రతాప్



బోయిన్‌పల్లిలో ఉచిత వైద్యశిబిరాన్ని ప్రారంభిస్తున్న జంపనప్రతాప్ తదితరులు

కంటోన్మెంట్, జూన్ 24 ప్రభాతవార్త: పేద ప్రజలకు ఉచిత వైద్య సేవలు అందించేందుకు స్వచ్ఛంద సంస్థలు ముందుకు రావాలని కంటోన్మెంట్ మాజీ ఉపాధ్యక్షుడు జంపనప్రతాప్ తెలిపారు. శనివారం 1వ వార్డు బోయిన్‌పల్లి వెంకటేశ్వర స్వామి ఆలయంలో నోవా కేర్ ఆసుపత్రి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరాన్ని అయన ప్రారంభించారు. రోగులకు,బీపి, షుగర్, జనరల్ చెకప్ వంటి వైద్య పరీక్షలు జరిపి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఆసుపత్రి డాక్టర్లు పెద్దిప్రవీణ్, డాక్టర్ రాజుకుమార్, ఆసుపత్రి మేనేజర్ సుధీర్ తదితరులు పాల్గొన్నారు.



అడ్డగుట్ట డివిజన్‌లో ఇంటింటికి బిజెపి కార్యక్రమాన్ని నిర్వహిస్తున్న మాజీ మేయర్ బండ కార్తీకరెడ్డి

## ఇంటింటికి బిజెపి ప్రచారం చేయాలి : బండ కార్తీక

కంటోన్మెంట్, జూన్ 24 ప్రభాతవార్త: పేద ప్రజల సంక్షేమం కోసం, దేశాభివృద్ధి కోసం ప్రధాని నరేంద్ర మోడి చేపడుతున్న కార్యక్రమాలను ప్రజలకు వివరిస్తూ బిజెపి పార్టీని మరింత బలోపేతం చేసేందుకు ప్రతి ఒక్కరు పాటుపడాలని మాజీ మేయర్ బండ కార్తీకరెడ్డి తెలిపారు. శనివారం అడ్డగుట్ట డివిజన్‌లోని నార్త్‌లాలాగూడ, తుకారాంగేట్ ప్రాంతాల్లో ఇంటింటికి బిజెపి కార్యక్రమంలో భాగంగా ప్రచారం చేస్తూ కేంద్ర ప్రభుత్వం చేపడతున్న సంక్షేమ పథకాలను ఇంటింటికి తిరుగుతూ ప్రచారం చేశారు. ఈ కార్యక్రమంలో శక్తి కేంద్ర ఇన్‌ఛార్జి శంకర్ రావ్, బిజెపి నాయకులు వీరన్న, శారధ మల్లేశ్, జ్యోతి సంపత్, కర్ణకర్, సంతోష్,రమేశ్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

## ఉచిత విద్యా కోసం అడ్మిషన్లు



ఉచిత విద్యా కోసం అడ్మిషన్లు అందచేసిన చైర్మన్ గడ్డం శ్రీనివాస్‌యాదవ్

బేగంబజార్,జూన్ 24ప్రభాతవార్త: నిరుపేద విద్యార్థినీ,విద్యార్థులకు ఉచితంగా ఇంటర్, డిగ్రీ,పిజి కోర్సులకు ధరఖాస్తు చేసుకున్న విద్యార్థినీ, విద్యార్థులకు గడ్డం గంగాధర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో అడ్మిషన్లు అందచేశారు. విద్యాశాఖ ఫలితాల తరువాత మొదటి,రెండవ, మూడ ధపా ఇంటర్,డిగ్రీ,పిజి విద్యార్థినీ, విద్యార్థులకు ధరఖాస్తులు చేసుకున్న అడ్మిషన్లు అందచేయడం జరిగిందని బిఆర్ఎస్ నాయకులు,గడ్డం గంగాధర్ ఫౌండేషన్ చైర్మన్ గడ్డం శ్రీనివాస్‌యాదవ్ తెలిపారు.దూల్‌పేట్, మంగళ్‌హాట్,జాంబాగ్,బేగంబజార్ తదితర ప్రాంతాల్లోని విద్యార్థినీ,విద్యార్థులకు అడ్మిషన్లు ఇవ్వడం జరిగిందన్నారు.అడ్మిషన్లు పొందిన విద్యార్థులు గడ్డం శ్రీనివాస్‌యాదవ్‌ను శాలువ కప్పి సన్మానించారు.

## ద్విచక్ర వాహనాన్ని ఢీకొట్టిన డీసీఎం.. ఇద్దరికి గాయాలు

పేట్‌బషీరాబాద్, జూన్24 ప్రభాతవార్త: నిర్లక్ష్యంగా, వేగంగా దూసుకొచ్చిన డీసీఎం ద్విచక్ర వాహనాన్ని బలంగా ఢీకొట్టిన సంఘటన పేట్‌బషీరాబాద్ పోలీస్ స్టేషన్ పరిధిలో శనివారం చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళితే... దేవరాయంజల్ రహదారిలో డాబర్ ఇండియా లిమిటెడ్ సమీపంలో వేగంగా,నిర్లక్ష్యంగా నడిపిన డీసీఎం(టీఎస్12యూసి3780) డ్రైవర్ శివరాజ్ ద్విచక్ర వాహనాన్ని ఢీకొట్టడంతో ద్విచక్రవాహనం, డీసీఎం అదుపు తప్పి చెట్టును ఢీకొట్టాయి. ఈ ప్రమాదంలో ద్విచక్రవాహనం (కెఎ64హెచ్0093)పై ఉన్న అమిత్ కుమార్, సుభాష్ అనే ఇద్దరు వ్యక్తులు కిందప డగా తీవ్ర గాయాలయ్యాయి. ఈ సంఘటనను గమనించిన స్థానికులు 108 సహాయం తో బాధితులిద్దరిని సమీపంలోని శ్రీకర ఆసుపత్రికి తరలించి వైద్యం అందిస్తున్నారు. నిర్లక్ష్యంగా వాహనం నడిపి ప్రమాదానికి కారణమైన డీసీఎం డ్రైవర్‌పై కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు.

## ప్రతి విదార్థికి నాణ్యమైన ఉచిత విద్యను అందించాలన్నదే ప్రభుత్వ లక్ష్యం: హోంమంత్రి

బేగంపేట జూన్ 24,ప్రభాతవార్త : తెలంగాణ రాష్ట్రంలోని ప్రతి పేద విద్యార్థికీ నాణ్యమైన ఉచిత విద్యను అందించాలన్నదే ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖరరావు నేతృత్వంలోని ప్రభుత్వ లక్ష్యం అని హోంమంత్రి మహమూద్ ఆలీ అన్నారు. శనివారం రాంగోపాల్‌పేట డివిజన్ నల్లగుట్ట లోని జియా ఉల్ ఇస్లాం హైస్కూలులో హోం మంత్రి కంప్యూటర్ ల్యాబ్ తో పాటు విద్యార్థులకు ఉచితంగా న్యూట్రిషియన్ అల్పాహారం అందించే కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలోని పేద విద్యార్థులందరికీ మెరుగైన విద్యను అందించేందుకు 204 రెసిడెన్షియల్ పాఠశాలలను ముఖ్యమంత్రి ప్రారంభించారని ఆయన చెప్పారు.అలాగే ముస్లీం మైనార్టీలకు కూడా అనేక పథకాలను ప్రవేశపెట్టడంతో పాటు వారు అన్ని రంగాల్లో ఉన్నత స్థాయికి చేరుకోవాలని అనేక పథకాలను ప్రవేశపెట్టారని అన్నారు.ముఖ్యంగా బాలికల విధ్యకు కేసీఆర్ మరింత ప్రాధాన్యత నిస్తున్నారని,చెప్పారు.విద్యతో పాటు అన్ని రంగాల్లో అభివృద్దిలో కూడా తెలంగాణా ప్రభుత్వం భారతదేశంలోనే నెంబర్ వన్ గా నిలుస్తుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో సుల్తాన్ ఎడ్యుకేషనల్ సొసైటీ అధ్యక్షులు జాఫర్ జావీద్,జియా ఉల్ ఇస్లామిక్ సొసైటీ కార్యదర్శి ఖాదిర్ సేఠ్ ,ఉపాధ్యక్షులు సల్మాన్ ఫారూఖ్ సేఠ్ తదితరులు పాల్గొన్నారు.



అబిడ్స్‌లో జరిగిన ఎడ్యుకేషన్ ఫెయిర్‌లో పాల్గొన్న యువత

# నియోకవర్గ అభివృద్ధి.. ప్రజా సంక్షేమమే నా నినాదం : మంత్రి



జల్‌పల్లి అర్బన్ ఫారెస్ట్‌లో చిల్డ్రన్ పార్కును ప్రారంభించిన మంత్రి సబితారెడ్డి

**సరూర్‌నగర్, జూన్ 24 ప్రభాతవార్త:** మహేశ్వరం నియోజకవర్గ అభివృద్ధి... ఇక్కడి ప్రజల సంక్షేమమే తమ నినాదమని రాష్ట్ర విద్యాశాఖ మ ంత్రి పట్లోళ్ళ సబితా ఇంద్రారెడ్డి స్పష్టం చేశారు. నియోజకవర్గంలోని జల్‌పల్లి మున్సిపా లిటీకి సంబంధించిన వివిధ వార్డుల్లో రూ.1.70 కోట్లతో చేపట్టిన వివిధ అభివృద్ధి పనులు, ప్రజా సంక్షేమ కార్యక్రమాలకు మంత్రి శనివారం శ్రీకారం చుట్టారు. స్థానిక మున్సిపల్ ఛైర్మన్ అబ్దుల్లా సాది, వైస్ ఛైర్‌పర్సన్ ఫర్హానా నాజ్, కమీషనర్ వసంత, పలువురు కౌన్సిలర్లు, బిఆర్ఎస్, ఎంఐఎం నాయకులు, స్థానిక ప్రజలతో కలిసి మంత్రి సిసి, బిటి రోడ్లకు శంకుస్థాపనలు, జల్‌పల్లి అర్బన్‌ఫారెస్ట్‌లో ఏర్పాటు చేసిన చిల్డ్రన్స్ పార్కును ప్రారంభించారు. అదే విధంగా జల్‌పల్లిలో మన ఊరు మన బడి కార్యక్రమం కింద తీర్చిదిద్దిన మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాలను ఆరంభించారు. ఈ సందర్భం గా సబితారెడ్డి మాట్లాడుతూ నియోజకవర్గ అభివృద్ధికి బాటలు వేస్తూ ప్రజలకు సంక్షేమ కార్యక్రమాలు అందివ్వడమే ప్రధాన లక్ష్యంగా ముందుకు పోతున్నామని వివరించారు. ఇందుకు భారీఎత్తున నిధులు కేటాయించి సహక రిస్తున్న సిఎం కెసిఆర్, పురపాలక శాఖ మంత్రి కెటిఆర్‌లకు ఆమె కృతజ్ఞతలు తెలిపారు. ఇటీవల పర్యటనకు వచ్చిన సిఎం కెసిఆర్ మీర్‌పేట్, బడంగ్‌పేట్ కార్పొరేషన్లకు రూ.50 కోట్ల చొప్పున అదే విధంగా జల్‌పల్లి, తుక్కుగూడ మున్సిపాలిటీలకు రూ.25 కోట్ల చొప్పున నిధులు కేటాయించడంపై హర్షం వ్యక్తం చేసిన సబితారెడ్డి సిఎంకు నియోజకవర్గ ప్రజల తరపున ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఈ నిధులతో ప్రజలకు కనీస సౌకర్యాలను కల్పిస్తా మని వెల్లడించారు. నాలాలు, తాగు నీటి సమస్యలను శాశ్వతంగా పరిష్కరిం చి సమీకృత మార్కెట్లు ఏర్పాటు చేయిస్తున్నట్లు ఆమె పేర్కొన్నారు. చెరువుల సుందరీకరణపై ప్రత్యేక దృష్టి సారించామని సబితారెడ్డి తెలిపారు. ఈ కార్య క్రమాల్లో కౌన్సిలర్లు, కో-ఆప్షన్ సభ్యులు, మున్సిపల్, ఫారెస్టు అధికారులు, ఎంఐఎం, బిఆర్ఎస్ నేతలు, కార్యకర్తలు, స్థానికులు పాల్గొన్నారు.

# దగ్గరలోనే కెసిఆర్ పాలన అంతమయ్యే రోజులు : విశ్వేశ్వర్‌రెడ్డి



అందెలతో కలిసి పాదయాత్ర చేస్తున్న కొండా విశ్వేశ్వర్‌రెడ్డి తదితరులు

**సరూర్‌నగర్, జూన్ 24 ప్రభాతవార్త:** తెలంగాణలో బిఆర్ఎస్ పాలనకు ప్రజ లు చరమగీతం పాడేరోజులు దగ్గరలోనేఉన్నాయని చేవెళ్ళ మాజీ పార్లమెంట్ సభ్యుడు కొండా విశ్వేశ్వర్‌రెడ్డి అన్నారు. మహేశ్వరం నియోజకవర్గంలోని బడంగ్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్‌లో గత మూడు రోజులుగా ప్రజా సమస్య లను తెలుసుకుంటూ కేంద్ర ప్రభుత్వ పథకాలను ప్రచారం చేస్తూ మహాజన సంపర్క్ అభియాన్ పేరిట గడప గడపకు బిజెపి కార్యక్రమాన్ని నిర్వహిస్తున్న నియోజకవర్గ బిజెపి ఇంఛార్జ్ అందెల శ్రీరాములు యాదవ్‌కు కొండా విశ్వేశ్వ ర్‌రెడ్డి మద్దతు తెలిపారు. ఈ మేరకు శనివారం ఆయన బడంగ్‌పేట్‌కు విచ్చేసి అందెలతో కలిసి గడప గడపకు బిజెపి కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన 3రోజులుగా స్వంత ఇంటి గడప తొక్కకుండా ప్రజల మధ్యేఉంటూ రాత్రింబవళ్లు పర్యటిస్తున్న శ్రీరాములు యాదవ్‌ను అభినందిం చారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సిఎం కెసిఆర్ పాలనలో రాష్ట్ర సాధన ఉద్యమాలు చేసిన వారికి ఆదరణ లేకుండా పోయిందని అన్నారు. రాష్ట్రంలో కెసిఆర్ పాలన అంతమయ్యే రోజు వస్తున్నదని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో కార్పొరేషన్ బిజెపి అధ్యక్షుడు చెరుకుపల్లి వెంకట్‌రెడ్డి, కార్పొరేటర్లు బంగారు అనితారాణి ప్రభాకర్, గౌర రమాదేవి శ్రీనివాస్, తోట శ్రీధర్‌రెడ్డి, నిమ్మల సునీత శ్రీకాంత్‌గౌడ్, రామిడి మాధురి వీరకర్ణారెడ్డి, దడిగ శంకర్, గడ్డం లక్ష్మారెడ్డి, గూడెపు ఇంద్రసేన, రామోజీ అమిత శ్రీశైలం చారి, నాయకులు సామ సంజీవరెడ్డి, నడికుడ యాదగిరి, గుర్రం మల్లారెడ్డి, పెత్తుల్ల పుల్లారెడ్డి, మద్ది రాజశేఖర్‌రెడ్డి, రామిడి శూరకర్ణారెడ్డి, రాళ్ళగూడెం రామకృష్ణారెడ్డి, చిత్రం శ్రీనివాస్, మమత ఆనంద్, మీర్‌పేట్ కార్పొరేటర్ నీలా రవినాయక్‌లతో పాటు చెవ్వ శ్రవణ్, గుండె నాగార్జున బాబు, ముఖేష్ యాదవ్ తదితరులు పాల్గొనా న్నరు.

**బాలాపూర్‌లో కొనసాగుతున్న శంకర్‌రెడ్డి యాత్రలు...** రాష్ట్ర బిజెపి అధ్యక్షు డు బండిసంజయ్ ఇచ్చిన పిలుపు మేరకు మహేశ్వరం నియోజకవర్గంలోని బాలాపూర్‌లో రాష్ట్ర పార్టీ కార్యవర్గ సభ్యుడు కొలన్ శంకర్‌రెడ్డి తలపెట్టిన మహాజన సంపర్క్ అభియాన్.. గడప గడపకు బిజెపి కార్యక్రమాలు శనివారంతో మూడవ రోజుకు చేరాయి. ఆయన బాలాపూర్ ఓల్డ్‌విలేజ్, హనుమాన్‌నగర్, బస్టాప్ ఏరియాలతో పాదయాత్రలు చేస్తూ ఇంటింటికి తిరిగి మోడి పథకాలను ప్రచారం చేశారు. ఈ కార్యక్ర మంలో ప్రభాకర్‌రెడ్డి, సుధాకర్, రవి, లక్ష్మారెడ్డి, శేఖర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## సామాజిక సేవా కార్యక్రమంలో వాసవి క్లబ్

**వనస్థలిపురం, జూన్ 24 ప్రభాతవార్త :** సామాజిక సేవా కార్యక్రమాల ద్వారా నే సమాజంలో తగిన గుర్తింపు వస్తుందని వాసవి క్లబ్ రీజియన్ ఛైర్మన్ అత్తు లూరి మల్లికార్జునరావు పేర్కొన్నారు. తుర్కయాంజాల్ వాసవి క్లబ్ అధ్యక్షుడు ఉప్పల మధుగుప్త ఆధ్వర్యంలో ఇంజాపూర్ చెరువు కట్ట వద్ద గల కట్ట మైసమ్మ దేవాలయంలో భక్తుల సౌకర్యార్థం మంచినీటి ట్యాంక్ ఎక్స్‌టెన్షన్, వాటర్‌ట్యాప్‌లు నిర్మించడం జరిగింది.అదేవిధంగా బిఎన్‌రెడ్డినగర్‌లో రోడ్డుపై వ్యాపారం చేసుకునే చిరువ్యాపారులకు వివిధ క్లబ్‌ల అధ్యక్షులు మద్ద శివనాగే శ్వర్‌రావు, మర్రి రమేష్, లక్ష్మిఆనంద్, రమాదేవి, నీల ధనలక్ష్మి చేతుల మీదుగా గొడుగుల పంపిణీ చేసారు. ఈ సందర్భంగా మల్లికార్జునరావు మాట్లాడుతూ వాసవి క్లబ్‌ల ఆధ్వర్యంలో తరచుగా వివిధ సామాజిక సేవా కార్యక్రమాలు చేపట్టడడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో భాస్కర్‌గుప్త, కొత్తమాసు రమేష్, బాదం జగదీశ్వర్, విట్టా సాయిమోహన్, నర్సింహులు, శ్రీనివాస్, మలిపెద్ది కవిత తదితరులు పాల్గొన్నారు.

## ఇసుక లారీల అడ్డా తరలింపుకు సహకరించాలని కాలనీలవాసుల వినతి



నందారెడ్డిని వినతి పత్రాన్ని సమర్పిస్తున్న కాలనీలవాసులు

**వనస్థలిపురం, జూన్ 24 ప్రభాతవార్త :** జాతీయ రహదారిపై ఆటోనగర్ వద్ద ఉన్న ఇసుకలారీల అడ్డా తరలింపుకు సహకరించాలని కోరుతూ వనస్థలిపురం తూర్పు కాలనీల సంక్షేమ సంఘం సభ్యులు శనివారం తెలంగాణ లారీ ఓనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు బూడిద నందారెడ్డికి వినతి పత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా సంఘం అధ్యక్షులు దీపావళి శ్రవణ్‌కుమార్, ప్రధా నకార్యదర్శి గుత్తా లక్ష్మణ్‌రెడ్డి తదితరులు మాట్లాడుతు ఆటోనగర్ సమీపం లోని ఇసుక, ఇటుక లారీల వల్ల ఏర్పడుతున్న దుమ్ము, ధూళితో వనస్థలిపు రం తూర్పున ఉన్న 21కాలనీల ప్రజలు చాలా ఏళ్ళుగా ఇబ్బందులు పడుతు న్నారని అన్నారు. నో ఎంట్రీ సమయంలో లారీలు కాలనీలలోకి వస్తుండడం తో స్థానికులు అసౌకర్యానికి గురవుతున్నారని అన్నారు. కాలనీల ప్రజల ఇబ్బందులను గుర్తించి లారీల అడ్డాను సాధ్యమైనంత త్వరగా ఇక్కడి నుంచి నివాస రహిత ప్రాంతాలకు తరలించాలని, అప్పటివరకు అడ్డాకు చుట్టూ ఫెన్సింగ్ ఏర్పాటు చేసి లారీలు అందులోనే నిలిపేలా చూడాలని నందారెడ్డిని కోరారు. కార్యక్రమంలో సంఘం నాయకులు బి.శ్రీనివాసులు, వి.సుదర్శన్ రెడ్డి కే.ఎల్.నర్సింహారావు, బి.మధుసూదన్‌రెడ్డి, పి.సుధాకర్‌రెడ్డి, భరత్ సింగ్, ప్రవీణ్‌గాడ్ తదితరులు పాల్గొన్నారు.

## రాజీవ్‌గాంధీ యూత్ ఆన్‌లైన్ క్విజ్ పోటీలలో యువత పాల్గొనాలి : చెకొలేకార్ శ్రీనివాస్



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న చెకొలేకార్ శ్రీనివాస్

**మలక్‌పేట, జూన్ 24 ప్రభాతవార్త :** రాష్ట్ర కాంగ్రెస్ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున ్న రాజీవ్‌గాంధీ యూత్ ఆన్‌లైన్ క్విజ్ కాంపిటీషన్‌లో యువత అధికసంఖ్యలో పాల్గొనాలని మలక్‌పేట నియోజకవర్గ కాంగ్రెస్‌పార్టీ ఇంఛార్జ్, టిపిసిసి ప్రధాన కార్యదర్శి చెకొలేకార్ శ్రీనివాస్ పేర్కొన్నారు. దిల్‌సుఖ్‌నగర్ లోని సిద్దార్థ మహిళా డిగ్రీ కళాశాలలో విద్యార్థులతో కలిసి క్విజ్ పోటీలకు సంబంధించిన కరపత్రాలను ఆవిష్కరించి అవగాహన కార్యక్రమాన్ని నిర్వ హించారు. దేశానికి వెన్నెముక యువత అని, వారికి అన్ని అంశాలపై అవగా హన కల్పించి క్విజ్ పోటీలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. జూలై 1వ తేదీ లోపు యువత తమ పేర్లను నమోదు చేసుకోవాలని కోరారు. ఆసక్తి గలవారు 7661899899 సెల్‌నెంబర్‌కు మిస్డ్ కాల్ ఇవ్వాలని కోరారు. ప్రతి నియో జకవర్గంలో మహిళ టాపర్స్‌కు ఎలక్ట్రిక్ స్కూటర్లను ఇవ్వనున్నట్లు తెలిపారు. మొదటి బహుమతి ల్యాప్‌టాప్, 2వ బహుమతి స్మార్ట్‌ఫోన్ 3వ బహుమతి ట్యాబ్‌తోపాటు ప్రోత్సాహక బహుమతలను అందజేయనున్నట్లు వివరించా రు. ఈ కార్యక్రమంలో కె.సూర్యప్రకాష్, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

## మల్కాజిగిరి సర్కిల్‌లో వీధి కుక్కల బెడద

### చర్యలు తీసుకోవడంలో విఫలమవుతున్న అధికారులు...



వీధుల్లో సంచరిస్తున్న కుక్కలు

కుక్కల దాడిలో గాయపడ్డ వృద్ధురాలు...

**నేరెడ్‌మెట్, జూన్ 24 ప్రభాతవార్త :** మల్కాజిగిరి సర్కిల్ పరిధిలో రోజురోజుకి కుక్కలబెడద తీవ్రతరం అవుతుంది. ఇంటి ముందు ఆడుకునే చిన్నారులు కుక్కల కారణంగా తీవ్ర గాయాలపాలవుతున్నారు. చిన్నారులనుండి పెద్దలను సైతం కుక్కలు భయభ్రాంతులకు గురి చేస్తూ వారిపై దాడులు చేస్తున్నాయి. గత రెండు రోజుల క్రితం ఓ చిన్నారిపై కుక్కలు దాడి చేసిన సంఘటన మరువకముందే నేరెడ్‌మెట్ డివిజన్ పరిధిలోని ఈస్ట్ క్రిష్ణానగర్‌లో ఓ చిన్నారిపై వీధి కుక్కలు మెరుపుదాడి చేసి గాయపరిచాయి. వెంటనే స్థానికులు ఆసు పత్రికి తరలించారు. వినాయక్‌నగర్ డివిజన్ పరిధిలోని కాకతీయ నగర్‌లో సీ బ్లాక్ గేటు వద్ద ఉన్న సరోజ అనే వృద్ధురాలపై వీధి కుక్కలు దాడి చేయడంతో ఆమెకు తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే ప్రథమ చిక్సిత చేసి మల్కాజిగిరి ప్రభుత ్వ ఆసుపత్రికి తరలించారు.

**అధికారుల తీరుపై మండిపడుతున్న ప్రజలు..** మల్కాజిగిరి సర్కిల్ పరిధి లోని డివిజన్లలో వీధి కుక్కలు స్థానికులపై దాడికి దిగుతున్న సంబంధిత అధికారులు మాత్రం చర్యలు తీసుకోవడంలో విఫలం అయ్యారని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇంటిముందు ఆడుకునే చిన్నారులపై వీధి కుక్క లు ఏ సమయంలో వచ్చి దాడులు చేస్తాయో అని చిన్నారుల తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు. సర్కిల్ పరిధిలో పెరుగుతున్న వీధి కుక్కల ఆగ డాలకు అడ్డుకట్ట వేయాల్సిన అధికారులు ఎటువంటి చర్యలు తీసుకోకపోవ డంపై పలు సంక్షేమ సంఘాల నాయకులు మండిపడుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

## మరణించిన రైతు కుటుంబానికి ఆర్థిక సహాయం : కొత్తకుర్మ సత్తయ్య



మరణించిన రైతు కుటుంబానికి ఆర్థిక సహాయం అందజేస్తున్న దృశ్యం

**తుర్కయంజాల్, జూన్ 24 ప్రభాతవార్త :** తుర్కయంజాల్ రైతు సేవా సహకా ర సంఘంలో అప్పు ఉన్న సభ్యుడు పసుల సత్యనారాయణ వారు ఈ నెల 20వ తేదీన గుండెపోటుతో దురదృష్టవశాత్తు మరణించడంతో మృతుడి భార్య పసుల సరస్వతికి ఆర్థిక సహాయం సంఘంనుండి రూ.25 వేలు చెక్కు ను ఆర్థిక సహాయంగా డిసిసిబి వైస్ ఛైర్మన్ కొత్తకుర్మ సత్తయ్య పంపిణీ చేసారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రైతు సేవా సహకార సంఘాలు రైతులకు ఎల్లప్పుడూ అండగా ఉంటాయని ఆయన తెలిపారు. ఈ కార్యక్ర మంలో రంగారెడ్డి జిల్లా రైతుబంధు సమితి అధ్యక్షుడు వంగేటి లక్ష్మారెడ్డి, సంఘం వైస్ ఛైర్మన్ కొత్త రాంరెడ్డి, స్థానిక కౌన్సిలర్ కొంద్రు మల్లేష్, డైరెక్టర్లు సామ సంజీవరెడ్డి, కొంద్రు స్వప్నశ్రీనివాస్, చాపల యాదగిరి, జక్క కృష్ణారెడ్డి, సిఈఓ వై.రాందాస్, రైతులు సంపతీశ్వర్‌రెడ్డి, కొంద్రు శ్రీనివాస్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## ప్రజలందరూ మంచి మనసుతో జీవించాలి : పాస్టర్ శ్యాంసుందర్

మలక్‌పేట, జూన్ 24 ప్రభాతవార్త: ప్రజలందరూ సహృదయంతో జీవించా లని పాస్టర్ శ్యాంసుందర్ పేర్కొన్నారు. ది పెంతెకొస్తు మిషన్ చర్చి ఆధ్వ ర్యంలో ఓల్డ్ మలక్‌పేట, ఎ1 ఫంక్షన్ హాల్‌లో నిర్వహిస్తున్న సుమార్త స్వస్తత మహాసభలలో ఆయన మాట్లాడుతూ పగ, కోపం, క్రోదం, ఈర్ష్య వంటివి మానవ మనుగడకు ప్రమాదమన్నారు. క్రీస్తు బోధించిన శాంతి, సమాదానం, శత్రువును క్షమించే ఆధ్యాత్మిక మార్గం ప్రపంచానికి ఆదర్శమన్నారు. హృద యశుద్ది గలవారు ధన్యులని పేర్కొన్నారు. సువార్త మహాసభలకు కుల మతాలకు అతీతంగా ప్రజలు, చర్చిపాస్టర్లు, విశ్వాసులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో బ్రదర్ శరణవన్ తదితరులు పాల్గొన్నారు.

## నాచారం డివిజన్‌లో పెండింగ్ పనుల పరిష్కారానికి కృషి : ఎమ్మెల్యే సుభాష్‌రెడ్డి



అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్ న ఎమ్మెల్యే బేతి తదితరులు

**నాచారం, జూన్ 24 ప్రభాతవార్త:** నాచారం డివిజన్‌లో పెండింగ్‌లో ఉన్న సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని ఉప్పల్ ఎమ్మెల్యే భేతిసుభాష్ రెడ్డి పేర్కొన్నారు. నాచారం డివిజన్‌లో రూ.53.60లక్షల వ్యయంతో వివిధ అభి వృద్ధి పనులకు స్థానిక కార్పొరేటర్ శాంతిసాయిజన్ శేఖర్‌తో కలిసి శంకుస్థా పనలు చేశారు. న్యూ అంబేద్కర్ నగర్‌లో రూ.21లక్షల వ్యయంతో నూతన సిసిరోడ్డు, అన్నపూర్ణకాలనీలో రూ.33లక్షలతో సీసీరోడ్డు నిర్మాణ పనులకు వారు శంకుస్థాపనలు చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే భేతిసుభాష్ రెడ్డి మాట్లాడుతూ డివిజన్‌లోని అన్ని ప్రాంతాల్లో సమస్యలు లేకుండా తగిన చర్యలు తీసుకుంటామన్నారు. కార్పొరేటర్ శాంతిసాయిజన్ శేఖర్ మాట్లా డుతూ డివిజన్‌లోని ఆయా ప్రాంతాల్లో మౌళిక సదుపాయాల కల్పనకు కృషి చేస్తున్నామన్నారు. డ్రైనేజీ, మంచినీరు, రోడ్ల సమస్యలను ప్రణాళిక బద్ధంగా తీర్చుతున్నామని చెప్పారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఇంజనీర్ రూపా, అసిస్టెంట్ ఇంజనీర్ లింగారావు, వర్క్‌ఇన్స్‌పెక్టర్ విజయ్‌కుమార్, నాచారం ఇన్స్‌పెక్టర్ నందీశ్వర్ రెడ్డి, టీఆర్ఎస్ నాయకులు ముత్యం రెడ్డి, కట్టబుచ్చన్న గౌడ్, విఠల్ యాదవ్‌తో పాటు పలువురు పాల్గొన్నారు.

## వైభవంగా జగన్నాథుడి రథయాత్ర మహోత్సవం

**ఎల్.బి.నగర్, జూన్ 24 ప్రభాతవార్త :** ఇస్కాన్ ఆధ్వర్యంలో ఆర్కేపురం డివిజన్ వాసవికాలనీలో శనివారం శ్రీజగన్నాథ రథయాత్ర మహోత్సవము కనులపండువగా నిర్వహించారు. భక్తుల కోలాహలం మధ్య రథయాత్ర నిర్వ హించగా పరిసర కాలనీవాసులు పెద్దఎత్తున హాజరయ్యారు. సాంస్కృతిక కార్యక్రమాలతో, ప్రవచనాలు బోధిస్తూ జగన్నాథుడి రథయాత్ర ముందుకు సాగింది. భక్తులు హరినామ కీర్తనతో ముందుకు సాగుతుండగా ఆ ప్రాంతం గోవిందనామస్మరణతో మారుమోగింది. వాసవి ఆధ్యాత్మిక కేంద్రంలో ప్రారం భమై అష్టలక్ష్మి దేవాలయంవరకు రథయాత్ర కొనసాగింది. ఇస్కాన్ ఆధ్వర్యం లో ప్రతిఆదివారం భగవద్గీత క్లాసులు జరుగుతాయని నిర్వాహకులు శ్రీనివాస్ అతిప్రియదాసు తెలిపారు. కార్యక్రమంలో ఆర్‌కెపురం డివిజన్ కార్పొరేటర్ రాధాధీరజ్‌రెడ్డి, వాసవికాలనీ సంక్షేమసంఘం అధ్యక్షుడు చంద్రశేఖర్‌గుప్తా, చిలుక ఉపేందర్‌రెడ్డి,అయిత అంజయ్య, శ్రీధర్, ఏపూరి రాజ్యలక్ష్మి, ఇస్కాన్ ప్రతినిధులు మురళీగోపినాథ్‌దాస్, లీలాశుఖదాస్, మాయ నర్సింగ్‌రావు, శశాంక్ తదితరులు పాల్గొన్నారు.

## రెడ్ క్రాస్ సేవలు అభినందనీయం:మంత్రి



సర్టిఫికెట్లు అందజేస్తున్న మంత్రి సబితాఇంద్రారెడ్డి

**ఎల్.బి.నగర్, జూన్ 24 ప్రభాతవార్త :** సమాజ సేవలో రెడ్‌క్రాస్ సంస్థ చేస్తు న్న సేవలు అభినందనీయమని రాష్ట్ర విద్యాశాఖ మంత్రి సబితాఇంద్రారెడ్డి పేర్కొన్నారు. రెడ్‌క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన నూతన అంబు లెన్స్‌ను శనివారం సరూర్‌నగర్ వార్డు కార్యాలయం వద్ద మంత్రి జండా ఊపి ప్రారంభించారు. సేవలో రెడ్‌క్రాస్ సొసైటీ పాత్ర ఎంతో గొప్పదని, ప్రచారా లకు దూరంగా ఉంటూ సేవే లక్ష్యంగా రాష్ట్ర వ్యాప్తంగా చేపడుతున్న కార్యక్ర మాలు అభినందనీయమని అన్నారు. వైద్య శిబిరాలు, రక్తదాన శిబిరాలు ఏర్పాటు చేస్తూ ప్రాణదాతలుగా నిలుస్తున్నారన్నారు. ముఖ్యమంత్రి కేసీఆర్ ఇలాంటి స్వచ్ఛంద సంస్థల సేవలు చేస్తున్న వారికి ప్రభుత్వం పరంగా కూడా సహకారం అందిస్తామని మంత్రి తెలిపారు.

## ప్రతి ఉద్యోగికి పదవీ విరమణ తప్పదు



జిహెచ్ఎంసి ఉద్యోగి బాల్‌రెడ్డిని సన్మానిస్తున్న బిఎల్ఆర్ బృందం

**కుషాయిగూడ, జూన్ 24,ప్రభాతవార్త :** ప్రతి ఉద్యోగికి పదవీ విరమణ తప్పద ని బిఎల్ఆర్‌ట్రస్ట్ వ్యవస్థాపక ఛైర్మన్ బండారి లక్ష్మారెడ్డి పేర్కొన్నారు. జిహెచ్ ఎంసి కాప్రా సర్కిల్ కార్యాలయంలో పనిచేస్తున్న బాల్‌రెడ్డి అనే ఉద్యోగి పదవి విరమణ చేసిన సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో డిప్యూటీ కమిషనర్‌తోపాటు ఆయన పాల్గొన్నారు..ఈ సందర్భంగా ఆయన మాట్లాడు తూ అంకితభావంతో పనిచేసి అందరి మన్ననలు పొంది పదవీ విరమణ చేస్తున్న బాల్‌రెడ్డి తన ఉద్యోగ అనుభవాన్ని ఇతరులకు అందజేయాలని సూచించారు. వారి భావి జీవితం ఆయురారోగ్యాలతో సుఖసంతోషాలతో గడ పాలని కోరుకుంటున్నాను ఈ కార్యక్రమంలో మల్లాపూర్ డివిజన్ కార్పొరేటర్ దేవేందర్‌రెడ్డి, మీర్‌పేట్ హెచ్‌బి కాలనీ డివిజన్ కార్పొరేటర్ జెర్రిపోతుల ప్రబుదాస్, మాజీ కార్పొరేటర్ శ్రీనివాస్‌రెడ్డి, మల్లాపూర్ డివిజన్ కంటెస్టెంట్ కార్పొరేటర్, చారిటబుల్ ట్రస్ట్ ప్రతినిధి కటార్ల భాస్కర్, మహేష్‌గౌడ్, కల్వల అంజి, బోదాసు నరేష్, తదితరులు పాల్గొన్నారు.

## బోనాలకు నిధులు విడుదల చేయాలి: అరుణ

**సైదాబాద్, జూన్ 24 ప్రభాతవార్త:** బోనాల పండుగకు నిధులు విడుదల చే యాలని కోరుతూ సైదాబాద్ డివిజన్ కార్పొరేటర్ కొత్తకాపు అరుణ రవీందర్ రెడ్డి శనివారం దేవాదాయ శాఖ అసిస్టె ంట్ కమీషనర్ బాలాజికి వినతిపత్రం అందజేశారు. అనంతరం కార్పొరేటర్ మాట్లాడుతూ బోనాల పండుగ సమీపి స్తున్నందున వెంటనే నిధులు విడుదల చేయాలని కోరడం జరిగిందన్నారు.

## నల్ల పోచమ్మ దేవాలయాభివృద్ధికి సహకారం




భూమి పూజలో పాల్గొన్న హరిగౌడ్

**సైదాబాద్, జూన్ 24 ప్రభాతవార్త:** గడ్డి అన్నారం చౌరస్తాలోని శ్రీ నల్ల పోచమ్మ దేవాలయం అభివృద్ధి కి తన పూర్తి సహకారం అందిస్తానని బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు లింగాల హరిగౌడ్ అన్నారు. దేవాలయ పునర్నిర్మా ణ భూమి పూజలో పాల్గొన్న అనంతరం ఆయన మాట్లాడుతూ దేవాలయాల ను కాపాడుకోవాల్సిన బాధ్యత మన అందరిపై ఉందన్నారు. ఈ కార్యక్రమంలో యాదగిరిగౌడ్, దర్పన్‌గౌడ్, చంద్రకాంత్‌గౌడ్, రామకృష్ణ, సునీల్, హన్మంత్, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

## అభివృద్ధి పనుల్లో వేగం పెంచాలి : దేవిరెడ్డి



అధికారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి

**ఎల్.బి.నగర్, జూన్ 24 ప్రభాతవార్త :** అభివృద్ధి పనుల్లో వేగం పెంచాలని అలసత్వం వీడాలని ఎల్‌బినగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో శుక్రవారం ఎస్ఎన్‌డిపీ, వాటర్ వర్క్స్ అధికారులు, కాలనీ వాసులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఇప్పటికే వర్షాకాలం ప్రారంభమైందని యుద్ధ ప్రాతిపదికన పనులు వేగవంతం చేయాలని ఆదేశించారు. అలాగే వెంకటరమణకాలనీ పనుల్లో వేగం పెంచాలని, భీమానగర్ దగ్గర కూడా పనులు 2 రోజుల్లో ప్రారంభించాలని ఆదేశించారు. పెండింగ్‌లో ఉన్న అన్ని పనులు అధికారులతో సమన్వయం చేసుకొని పనులు పూర్తి చేయాలన్నారు. ఎస్ఎన్‌డిపీ పనుల్లో భాగంగా జలమండలికి సంబంధించిన వాటర్‌పైప్‌లైన్ ధ్వంసమయ్యాయని, ఆయా పనుల్లో ప్రత్యేక ప్రణాళికలు సిద్ధం చేసి జాగ్రత్త లు పాటిస్తూ పనులు చేయాలన్నారు. పనులు చేపడుతున్న నేపథ్యంలో జలమండలి అధికారులను కూడా భాగస్వామ్యం చేసుకొని పనులు పూర్తి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జలమండలి మేనేజర్ వినోద్, ఎస్ఎన్‌డిపీ అధికారులు కృష్ణయ్య, పలువురు అధికారులు పాల్గొన్నారు.

## ఇంటి పైకప్పు కూలి నలుగురికి గాయాలు

### బాధితులను ఆదుకుంటామని ఎమ్మెల్యే హామీ



పైకప్పు కూలి గాయాలైన దృశ్యాలు

**ఎల్.బి.నగర్, జూన్ 24 ప్రభాతవార్త :** ఇంటి పైకప్పు కూలిన సంఘటనలో నలుగురికి గాయాలయ్యాయి. ఇంట్లో నిద్రపోతున్నక్రమంలో అర్ధరాత్రి అకస్మా త్తుగా పైకప్పు కూలింది. ఈ సంఘటన చైతన్యపురి డివిజన్ మున్సిపల్ కాలనీలో చోటు చేసుకుంది. ఈ ప్రమాదంలో ఆంగోత్ రంగనాయక్, అతని భార్య బిందు, కొడుకులు బాబుగౌతమ్ (3), 2నెలల రెండో బాబుకు తలకు, వీపుకు, చేతులపై, కాళ్ళపై గాయాలయ్యాయి. సంఘటనకు సంబంధించి బాధితులు ఎల్బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి దృష్టికి తీసుకువెళ్లారు. అందుకు స్పందించిన ఎమ్మెల్యే చైతన్యపురి బిఆర్ఎస్ నాయకుడు సొంటి చంద్రశేఖర్‌రెడ్డిని పిలిపించి సంఘటనకు సంబంధించిన సమాచారం తెలుసు కొని వారికి అండగా నిలవాలని ఆదేశించారు. వెంటనే చంద్రశేఖర్‌రెడ్డి మున్సి పల్ కాలనీలోని సంఘటన స్థలానికి వెళ్లి జరిగిన నష్టాన్ని గురించి ఎమ్మెల్యే కు వివరించారు. అందుకు స్పందించిన ఎమ్మెల్యే బాధితులకు తమ సహాయ సహకారాలు అందిస్తామని ఆందోళన చెందాల్సిన అవసరం లేదని హామీ ఇచ్చారు. ప్రభుత్వం తరుపున గృహలక్ష్మి పథకం ద్వారా సహాయం అందించే విధంగా చర్యలు చేపడతామన్నారు. ఈ కార్యక్రమంలో చైతన్యపురి బిఆర్ఎస్ వర్కింగ్‌ప్రెసిడెంట్ నరేష్, కార్మికశాఖ అధ్యక్షులు జలంధర్, హరిబాబు, రాజు, కాలనీ సభ్యులు పాల్గొన్నారు.

## వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి

**ఎల్.బి.నగర్, జూన్ 24 ప్రభాతవార్త :** వైద్య శిబిరాలను ప్రతిఒక్కరు సద్విని యోగం చేసుకోవాలని వెంకటేశ్వరాకాలనీ అసోసియేషన్ అధ్యక్షుడు గందు ధనంరెడ్డి పేర్కొన్నారు. రోడ్డు నెంబర్ 8లోని లైబ్రరీ భవనంలో ఓజోన్ ఆసు పత్రి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరాన్ని అయన ప్రారంభిం చారు. ఈ శిబిరంలో ఓజోన్ ఆసుపత్రి వైద్యుల సమక్షంలో మధుమేహం, రక్తపోటు, పరీక్షలతోపాటు క్లోవ్ డెంటల్ ఆసుపత్రి వైద్యుల సమక్షంలో దంత పరీక్షలు ఉచితంగా నిర్వహించి సూచనలు, సలహాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ అరుణ,డాక్టర్ సమీర్, వెంకటేశ్వరా దేవాలయం ఛైర్మన్ కోరుపోలు భాస్కర్‌రెడ్డి, అసోసియేషన్ సభ్యులు సప్పిడి గోవర్ధన్‌రెడ్డి, మధు సూదన్‌రెడ్డి, విజయకుమార్, గణేష్ తదితరులు పాల్గొన్నారు.

## బిజెపితోనే అభివృద్ధి : కార్పొరేటర్ శ్రీవాణి



ఇంటిం టికీ బిజెపి కార్యక్రమంలో పాల్గొన్న కార్పొరేటర్ శ్రీవాణి తదితరులు

**ఎల్.బి.నగర్, జూన్ 24 ప్రభాతవార్త :** ప్రధానమంత్రి మోడీ నాయకత్వంలో బిజెపితోనే అభివృద్ధి సాధ్యం అవుతుందని సరూర్‌నగర్ డివిజన్ కార్పొరేటర్ ఆకుల శ్రీవాణి అంజన్‌కుమార్ పేర్కొన్నారు. రాష్ట్రవ్యాప్తంగా చేపట్టిన ఇంటిం టికీ బిజెపి కార్యక్రమంలో భాగంగా శనివారం సరూర్‌నగర్ డివిషన్లో ప్రధాని నరేంద్రమోడీ 9ఏళ్ల పాలన విజయాలు, సుపరిపాలన, సంక్షేమ పథకాల గురించి వివరించి కార్పొరేటర్ వివరించారు. ప్రధాని మోదీకి మద్దతు తెలపడానికి ప్రతిఒక్కరు 9090902024 నెంబర్‌కు మిస్డ్‌కాల్ ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో రంగారెడ్డి జిల్లా బిజెపి ఉపాధ్యక్షుడు ఆరుట్ల సురేష్ తదితరులు పాల్గొన్నారు.

## నేడు శ్రీపురం కాలనీలో ఉచిత వైద్య శిబిరం

**మలక్‌పేట, జూన్ 24 ప్రభాతవార్త :** మూసారాంబాగ్ డివిజన్‌లోని శ్రీపురం కాలనీ కమ్యూనిటీ హాల్‌లో ఆదివారం ఉదయం 9 గంటలనుండి మధ్యా హ్నం 1 గంటలవరకు కీళ్లమార్పిడి, తుంటిమార్పిడి సమస్యలపై ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు ఎఆర్ఆర్ ఫౌండేషన్ అధ్యక్షుడు డి.వేణుమాధవ్ తెలిపారు. వైద్య శిబిరంలో రోబోటిక్స్ కీలు మార్పిడి శస్త్ర చికిత్స నిపుణులు డాక్టర్ అభిషేక్, బర్లీ వైద్య సవేలు అందిస్తారని ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

## నిరుపేదలకు అండగా సిఎం రిలీఫ్ ఫండ్

**మల్కాజిగిరి, జూన్ 24 ప్రభాతవార్త :** ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావు ఆదేశాలమేరకు ఆర్‌కేనగర్‌లో ఓల్డ్ నేరెడ్‌మెట్‌కు చెందిన భాగ్యలక్ష్మి నిమ్స్‌లో వైద్య చికిత్సకోసం వారిఖర్చుల నిమిత్తం ముఖ్యమంత్రి సహాయనిధినుండి లక్ష రూపాయల ఎల్ఓసిని మల్కాజిగిరి అధికార ప్రతినిధి జీఎన్‌వి సతీష్ కుమార్ వారి కుటుంబ సభ్యులకు అందజేయడం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నిరుపేదలకు ముఖ్యమంత్రి సహాయనిధి అండగా ఉంటుందన్నారు. ఈ పథకాన్ని నిరుపేదలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కన్నా, పార్థు, సైదులు, సాయిగౌడ్ తదితరులు పాల్గొన్నారు.